# విలేకరులు కావలెను

భారత్ RNI.APTEL/16364/2023 తెలుగు దినపత్రిక BHARATH REPORTER రిపోర్టర్

తెలుగు రాష్ట్రాలలో వెలువడుతున్న భారత్ రిపోర్టర్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను.తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికీ, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికీ ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి:

**7668886666**



Postal Licenced No: HDP/010/2024-2026

# భారత్ రిపోర్టర్

RNI.APTEL/2023/88573 తెలుగు దినపత్రిక

BHARATH REPORTER

BHARAT REPORTER RNI.APTEL/2023/88573 TELUGU DAILY NEWS PAPER

అనంతపురం - సంపుటి : 02 సంచిక : 25 ఎడిటర్.. కొట్లపల్లి ఫౌజియా పేజిలు : 08, వెల . రూ. 2/- శుక్రవారం - 05 - సెప్టెంబర్ - 2025


### పామాయిల్‌పై సుంకాల తగ్గింపుతో
## రైతులకు తీవ్ర నష్టం: భట్టి విక్రమార్క



రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న విద్యాసంస్థలకు ఆర్థిక సాయం అందించాలి

రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టం అంచనాలను కేంద్ర హెూం మంత్రికి వివరణ

### 'ఓట్ చోర్..' దీదీ ఘాటు వ్యాఖ్యలతో
## రణరంగంగా బెంగాల్ అసెంబ్లీ

బీజేపీ ఎమ్మెల్యేల జై శ్రీరాం నినాదాలతో, అరుపులతో, ఈడ్చివేతలతో పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ రణరంగాన్ని తలపించింది. ప్రతిపక్షంపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర విమర్శలు చేయగా.. అడ్డుకునేందుకు వాళ్లు తీవ్రంగా ప్రయత్నించారు. ఈ క్రమంలో పరిస్థితి అదుపు తప్పడంతో మార్షల్స్ సాయంతో బీజేపీ ఎమ్మెల్యేలను స్పీకర్ బయటకు పంపించేశారు.



## జనవరిలో స్థానిక పోరు.. ఏపీ ఎన్నికల సంఘం ఏర్పాట్లు

- వచ్చే ఏడాది ఏప్రిల్ లో ముగియనున్న సర్పంచ్ ల పదవీకాలం
- 3 నెలల ముందే ఎన్నికలు నిర్వహించే ఏర్పాట్లలో ఎస్ఈసీ
- పంచాయతీరాజ్‌శాఖ, పురపాలక కమిషనర్లకు ఇప్పటికే లేఖలు







### పిఠాపురం నియోజకవర్గంలోని ఉపాధ్యాయులకు ప్రత్యేక కానుకలు పంపిన పవన్ కల్యాణ్

- పిఠాపురంలో ఒకరోజు ముందే మొదలైన ఉపాధ్యాయ దినోత్సవ సందడి
- నియోజకవర్గంలోని 2 వేల మంది గురువులకు పవన్ కల్యాణ్ కానుకలు
- మహిళా టీచర్లకు చీరలు, పురుషులకు ప్యాంటు-షర్టు క్లాత్‌ల అందజేత

# యూనివర్సల్ హెల్త్ పాలసీకి ఏపీ కేబినెట్ ఆమోదం




### ఎన్డీయే భాగస్వామ్య పక్షాలపై విమర్శలు వస్తే గట్టిగా తిప్పికొట్టాలి: సీఎం చంద్రబాబు

వివరాలు 2లో..

ఎన్డీయే భాగస్వామ్య పక్షాలపై ఎలాంటి విమర్శలు వచ్చినా గట్టిగా తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సహచరులకు సూచించారు. మంత్రివర్గ సమావేశం అనంతరం రాజకీయ అంశాలపై చర్చ జరిగింది. ప్రధాని మోదీ తల్లిపై రాహుల్ గాంధీ విమర్శలను సకాలంలో తిప్పికొట్టాల్సి ఉందన్నారు. కూటమి పార్టీలుగా పరస్పరం సహకరించుకుంటూ.. ఎవరిపై ఎలాంటి విమర్శ వచ్చినా సమర్థంగా తిప్పికొడదామని తెలిపారు. కిలేడీ అరుణ వ్యవహారంలో అధికారులు సరైన రీతిలో స్పందించకపోవడం వల్లే నేతలు నింద పడాల్సి వస్తోందని మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు. అరుణ.. రౌడీషీటర్ శ్రీకాంత్‌కు పెరోల్ ఇప్పించిన ఘటనలో అధికారులు కూడా స్పందించి ఉండాల్సిందన్నారు. సుగాలి ప్రీతి అంశంలోనూ గత ప్రభుత్వ నిర్లక్ష్యంపై అధికారులు మాట్లాడితే బాగుండేదని మనోహర్ అభిప్రాయపడ్డారు.




## ప్రద్యుమ్నతో నారా లోకేశ్ కు సంబంధాలున్నాయి

అమరావతి: ఏపీ లిక్కర్ స్కాం వ్యవహారంలో మంత్రి నారా లోకేశ్ కు సంబంధాలున్నాయంటూ వైసీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఈ కేసులో ప్రచారంలో ఉన్న ప్రద్యుమ్న అనే వ్యక్తికి లోకేశ్ తో సంబంధాలున్నాయని, గతంలో లోకేష్ 'స్టూడియో-ఎన్' ఛానెల్‌ను ప్రమోట్ చేశారని ఆయన వెల్లడించారు. స్టూడియో-ఎన్ చానల్లో గతంలో ప్రద్యుమ్న క్రియాశీలక డైరెక్టర్ గా వ్యవహరించాడని తెలిపారు. గురువారం తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. లిక్కర్ స్కాంలో తమ వారిపై వస్తున్న ఆరోపణలను సజ్జల తీవ్రంగా ఖండించారు. యాక్టివిటీ లేని భీమ్ కంపెనీకి అసలు బ్యాంక్ ఖాతానే లేదని, మిగతా.. 2లో

## జీఎస్టీపై మోదీ సర్కార్ 'కుంభకర్ణ నిద్ర' వీడింది

- 8 ఏళ్ల తర్వాత జీఎస్టీపై మోదీ సర్కార్ మేల్కొందన్న ఖర్గే
- తాము తెస్తే వ్యతిరేకించి ఇప్పుడు సంబరాలు చేసుకుంటున్నారని విమర్శ
- 'ఒకే దేశం, ఒకే పన్ను'ను 'ఒకే దేశం, 9 పన్నులు'గా మార్చారంటూ ఫైర్
- సామాన్యులపై భారం మోపిన 'గబ్బర్ సింగ్ ట్యాక్స్' ఇదేనని మండిపాటు
- రాష్ట్రాలకు ఐదేళ్లపాటు పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వాలని డిమాండ్



ఢిల్లీ: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) సంస్కరణల విషయంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి ఎనిమిదేళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత జ్ఞానోదయం కలిగిందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎద్దేవా చేశారు. ఇన్నాళ్లకు కేంద్ర ప్రభుత్వం 'కుంభకర్ణ నిద్ర' వీడి మేల్కొనడం మంచి విషయమేనంటూ ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మిగతా.. 2లో



### మా బంధం దౌత్యానికి మించినది సింగపూర్‌పై మోదీ కీలక వ్యాఖ్యలు

ఏఐ, గ్రీన్ షిప్పింగ్ వంటి భవిష్యత్ రంగాల్లో సహకారం

చెన్నైలో సింగపూర్ సహకారంతో నైపుణ్యాభివృద్ధి కేంద్రం

### నేడు ప్రధాని మోదీతో
## మంత్రి లోకేశ్ భేటీ..
### ఢిల్లీకి పయనం

- మర్యాదపూర్వకంగానే ప్రధానితో సమావేశం
- భేటీ అనంతరం నేడు మధ్యాహ్నం రాష్ట్రానికి తిరుగుపయనం
- అమరావతిలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో పాల్గొననున్న మంత్రి
- 'ఎక్స్' వేదికగా జీఎస్టీ సంస్కరణలను స్వాగతించిన లోకేశ్



అమరావతి: ఏపీ మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన సెప్టెంబర్ 5వ తేదీ ఉదయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశం కానున్నారు. ఈ భేటీ కోసం మంత్రి లోకేశ్ రాత్రే ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ప్రధాని మోదీతో మంత్రి లోకేశ్ జరపనున్న ఈ సమావేశం పూర్తిగా మర్యాదపూర్వక భేటీ అని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీలో ప్రధానితో సమావేశం ముగిసిన వెంటనే మంత్రి లోకేశ్ తిరిగి రాష్ట్రానికి పయనం కానున్నారు. మిగతా.. 2లో



### ఓనర్ రమణమ్మ గారూ.. రండి !

- ఇంజనీర్ తరహాలో ప్రతీ గోడను పరిశీలన
- నిర్మాణ నాణ్యతపై సంతృప్తి చెందిన సీఎం, ఇదే తరహాలో ఇతర చోట్ల కూడా నిర్మించాలి
- ఇందిరమ్మ ఇంటి నాణ్యతపై రేవంత్ ఆరా
- ఏమైనా లోటుపాట్లు ఉన్నాయా ?
- తమ గ్రామానికి పీహెచ్‌సీ కావాలని సీఎంను కోరుదామనుకున్నామని, కానీ హడావుడిలో సాధ్యం కాలేదు

### శాఖల మధ్య సమన్వయంతోనే
# వరద నష్టాలను తగ్గించగలం



- ★ ఎవరికి వారు ఉంటామంటే క్రైసిస్ మేనేజ్‌మెంట్ చేయలేం
- ★ మరమ్మతులు, నిర్మాణాలు, తాత్కాలికం కాకుండా శాశ్వత ప్రాతిపదికన చేపట్టాలి
- ★ ఎరువుల పంపిణీలోనూ సమన్వయలోపం వల్లే సమస్యలు వస్తున్నాయి
- ★ యూరియా పంపిణీలో ముందుగా రైతులకు టోకెన్లు ఇచ్చి గందరగోళం లేకుండా చూడాలి



కామారెడ్డి:భారీ వర్షాలు, వరదల వల్ల నష్టం జరిగిన చోట శాశ్వత పరిష్కారం చూపేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు అధికారులను ఆదేశించారు. వరదల వల్ల పంట పొలాల్లో ఇసుక మేటలను తొలగించేందుకు ప్రత్యేకంగా నిధులను మంజూరు చేస్తామని చెప్పారు. రోడ్లు, పంటలు దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించిన ముఖ్యమంత్రి గారు స్థానికులతో మాట్లాడారు. కొడంగల్‌కు ఎంత మేరకు సాయం చేస్తానో మిగతా.. 2లో

ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం ఉంటేనే.. వరద నష్టాలను తగ్గించగలమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఎవరికి వారు ఉంటామంటే క్రైసిస్ మేనేజ్‌మెంట్ చేయలేమన్నారు. కామారెడ్డి జిల్లాలో వరదనష్టంపై కలెక్టరేట్‌లో సీఎం సమీక్ష నిర్వహించారు. భారీ వర్షాలు, వరదల కారణంగా జిల్లాలో ఎంత నష్టం జరిగింది, ఎన్ని నిధులు అవసరమో స్పష్టమైన నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మరమ్మతులు, నిర్మాణాలు, తాత్కాలికం కాకుండా శాశ్వత ప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. ఎరువుల పంపిణీలోనూ సమన్వయలోపం వల్లే సమస్యలు వస్తున్నాయన్నారు. యూరియా పంపిణీలో ముందుగా రైతులకు టోకెన్లు ఇచ్చి గందరగోళం లేకుండా చూడాలన్నారు. సమస్య వచ్చినప్పుడు రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని సూచించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సమస్యలపై 15 రోజుల తర్వాత మరోసారి సమీక్ష నిర్వహించనున్నట్టు చెప్పారు. మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, వివిధశాఖల ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

Postal Licenced No: HDP/010/2024-2026
భారత్ రిపోర్టర్
RNI.APTEL/2023/88573 తెలుగు దినపత్రిక
BHARATH REPORTER



# నేడు ప్రధాని మోదీతో మంత్రి లోకేశ్ భేటీ..

నేడు మధ్యాహ్నానికల్లా ఆయన రాష్ట్రానికి చేరుకుంటారని సమాచారం. అనంతరం ఆయన నేరుగా అమరావతిలో జరగనున్న ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారు.

జీఎస్టీ చారిత్రాత్మక సంస్కరణలను స్వాగతిస్తున్నాం: మంత్రి లోకేశ్

జీఎస్టీలో భాగంగా ఇప్పటివరకు ఉన్న నాలుగు శ్లాబులను రెండుకు కుదించడం, నిత్యావసరాలపై పన్ను రేట్లను తగ్గించడం వంటివి వృద్ధికి దోహదపడే సానుకూల నిర్ణయాలని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఈ సంస్కరణలు దేశ పన్నుల విధానాన్ని మరింత సరళతరం చేస్తాయని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆయన కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రిగా, ముఖ్యంగా పెన్సిళ్లు, షార్ప్‌నర్‌లు, వ్యాయామ పుస్తకాలు (ఎక్సర్‌సైజ్ బుక్స్), మ్యాపులు, చార్టుల వంటి వాటిపై జీఎస్టీ తగ్గించడాన్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ నిర్ణయం విద్యార్థుల తల్లిదండ్రులకు ఎంతో ఊరటనిస్తుందని అన్నారు. ఇలాంటి చర్యలు విజ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించడానికి ఎంతగానో ఉపయోగపడతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. సరళమైన, వృద్ధికి అనుకూలమైన పన్నుల విధానాన్ని తీసుకొచ్చినందుకు ప్రధాని మోదీని ఆయన ప్రశంసించారు.

# 'ఓట్ చోర్..' దీదీ ఘాటు వ్యాఖ్యలతో రణరంగంగా బెంగాల్ అసెంబ్లీ

ఢిల్లీ: బీజేపీపై మమతా బెనర్జీ తీవ్ర విమర్శలు.. ప్రతిపక్ష బీజేపీ ఆందోళనలతో బెంగాల్ అసెంబ్లీ గురువారం అట్టుడికిపోయింది. ఇతర రాష్ట్రాల్లో బెంగాలీ వలస కూలీలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ టీఎంసీ ప్రభుత్వం ఓ తీర్మానం ప్రవేశపెట్టింది. అయితే ఈ తీర్మానంపై ప్రసంగిస్తూ.. సీఎం మమతా బెనర్జీ తీవ్ర వ్యాఖ్యలే చేశారు. బీజేపీని బెంగాల్ వ్యతిరేక పార్టీగా అభివర్ణించిన ఆమె.. ఓట్ల చోరీతో అతిపెద్ద దోపిడీకి పాల్పడిందని ఆరోపించారు. పార్లమెంట్‌లోనూ టీఎంసీ ఎంపీలను సీఐఎస్ఎఫ్ బలగాలను ఉపయోగించి ఏ విధంగా వేధించారో అంతా చూశారని అన్నారామె. బెంగాలీలను మోదీ, అమిత్ షాలు వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారామె. "బీజేపీ అవినీతి పార్టీ. ఓట్ల దొంగ. అతిపెద్ద దోపిడీ పార్టీ. బీజేపీ నుంచి బెంగాల్‌ను, దేశాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉంది అని ఆమె ప్రసంగించారు. ఆ సమయంలో బీజేపీ ఎమ్మెల్యేలు "జై శ్రీరాం" నినాదాలతో ఆమె ప్రసంగానికి అడ్డు తగిలారు. దీంతో ఆమె మరింత స్వరం పెంచారు.

"రాసిపెట్టుకోండి. బెంగాల్ అసెంబ్లీలో బీజేపీకి ఒక్క ఎమ్మెల్యే కూడా లేకుండా పోతాడు. మీరు చేసే రాజకీయాలకు.. అధికార పీఠం నుంచి ప్రజలు మిమ్మల్ని దించేస్తారు. మోదీ షా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కుప్పకూలడం ఖాయం" అని అన్నారామె. బీజేపీ ఎమ్మెల్యేల ప్రవర్తన అన్‌పార్లమెంటరీగా ఉందన్న ఆమె.. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే బెంగాలీలపై దాడులు జరుగుతున్నందున అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ తరుణంలో.. బీజేపీ సభ్యులు మరింతగా ఊగిపోయారు. టీఎంసీ సభ్యులతో వాగ్వాదానికి దిగడంతో ఒకరినొకరు తోసేసుకున్నారు. దీంతో.. చీఫ్ విప్ డాక్టర్ శంకర్ ఘోష్ సహా బీజేపీ ఎమ్మెల్యేలను ఇవాళ్టి సెషన్ నుంచి స్పీకర్ సస్పెండ్ చేశారు. అయితే.. ఆయన బయటకు వెళ్లేందుకు నిరాకరించడంతో మార్షల్స్ సాయంతో బయటకు బలవంతంగా పంపించేశారు. ఈ క్రమంలో ఆయన స్పృహ కోల్పోవడంతో ఆస్పత్రికి తరలించారు. మరోవైపు.. ఈ పరిణామంతో ప్రతిపక్ష నేత సువేందు అధికారి హుటాహుటిన అసెంబ్లీ వద్దకు చేరుకున్నారు. మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. టీఎంసీ కేడర్‌ను గూండాలుగా అభివర్ణించారు. టీఎంసీ గూండాలు శంకర్ ఘోష్‌పై భౌతిక దాడికి పాల్పడ్డారని ఆరోపించారాయాన. మమతా బెనర్జీనే అతిపెద్ద దొంగ అని అన్నారు. ఇదిలా ఉంటే.. బెంగాల్ అసెంబ్లీ స్పెషల్ సెషన్ కార్యకలాపాలకు అడ్డుతగిలారని సువేందు అధికారిని ఇదివరకే సభ నుంచి సస్పెండ్ చేశారు.

# జనవరిలో స్థానిక పోరు.. ఏపీ ఎన్నికల సంఘం ఏర్పాట్లు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఏర్పాట్లు చేస్తోంది. వచ్చే ఏడాది ఏప్రిల్ లో సర్పంచ్ ల పదవీ కాలం, కార్పొరేటర్లు, కౌన్సిలర్ల పదవీకాలం మార్చిలో ముగియనుండగా.. చట్టంలోని వెసులుబాట్ల మేరకు జనవరిలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎస్ఈసీ ఏర్పాట్లు ప్రారంభించింది. ఈ మేరకు పురపాలక, పంచాయతీరాజ్ కమిషనర్లకు ఏపీ ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీ బుధవారం లేఖలు రాశారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు ప్రారంభించాలని ఆ లేఖలో పేర్కొన్నారు.

లేఖలో పేర్కొన్న షెడ్యూల్..

అక్టోబరు 15 లోగా వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి, నవంబరు 15లోగా వార్డుల వారీగా ఓటర్ల జాబితాల ప్రచురణ, నవంబరు 1 నుంచి 15లోగా ఎన్నికల అధికారుల నియామకం, నవంబరు 30లోగా పోలింగ్ కేంద్రాల ఖరారు, ఈవీఎంల ఏర్పాట్లు, డిసెంబరు 15లోపు రిజర్వేషన్లు ఖరారు, 2026 జనవరిలో నోటిఫికేషన్, ఎన్నికల నిర్వహణ, ఫలితాల ప్రకటన.

# జీఎస్టీపై మోదీ సర్కార్ 'కుంభకర్ణ నిద్ర' వీడింది

మొదటి పేజి తరువాయి

ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. జీఎస్టీ కౌన్సిల్ ఇటీవల పన్ను స్లాబులలో కీలక మార్పులు చేసిన నేపథ్యంలో ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. గత దశాబ్ద కాలంగా జీఎస్టీని సరళీకరించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తూనే ఉందని ఖర్గే గుర్తుచేశారు. "మోదీ ప్రభుత్వం 'ఒకే దేశం, ఒకే పన్ను' అనే నినాదాన్ని 'ఒకే దేశం, 9 పన్నులు'గా మార్చేసింది. 0%, 5%, 12%, 18%, 28% స్లాబులతో పాటు 0.25%, 1.5%, 3%, 6% ప్రత్యేక రేట్లను ప్రవేశపెట్టి గందరగోళం సృష్టించింది" అని ఆయన విమర్శించారు. సరళమైన పన్నుల విధానంతో 'జీఎస్టీ 2.0'ను తాము 2019, 2024 మేనిఫెస్టోలలోనే ప్రతిపాదించామని తెలిపారు. ఒకప్పుడు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నరేంద్ర మోదీనే జీఎస్టీని తీవ్రంగా వ్యతిరేకించారని ఖర్గే ఆరోపించారు. "2011లో అప్పటి ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ జీఎస్టీ బిల్లును ప్రవేశపెట్టినప్పుడు బీజేపీ అడ్డుపడింది. కానీ ఇవాళ అదే బీజేపీ ప్రభుత్వం రికార్డు స్థాయిలో జీఎస్టీ వసూళ్లు జరిగాయని సంబరాలు చేసుకుంటోంది. సామాన్యుల నుంచి పన్నులు వసూలు చేయడం గొప్ప ఘనత అన్నట్లుగా వ్యవహరిస్తోంది" అని ఆయన దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వం పాలు, పెరుగు, పిండి, ధాన్యాలతో పాటు వ్యవసాయ రంగానికి చెందిన 36 వస్తువులపై జీఎస్టీ విధించిందని, అందుకే తాము దీనిని 'గబ్బర్ సింగ్ ట్యాక్స్' అని పిలుస్తున్నామని ఖర్గే అన్నారు. వసూలవుతున్న మొత్తం జీఎస్టీలో 64 శాతం పేద, మధ్యతరగతి ప్రజల నుంచే వస్తోందని, కానీ కేవలం 3 శాతం మాత్రమే కుబేరుల నుంచి వస్తోందని ఆయన ఆరోపించారు. తాజాగా చేపట్టిన సంస్కరణల వల్ల రాష్ట్రాలు ఆదాయం కోల్పోయే అవకాశం ఉన్నందున, 2024-25ను ఆధార సంవత్సరంగా తీసుకుని ఐదేళ్లపాటు పూర్తి పరిహారం చెల్లించాలని ఖర్గే డిమాండ్ చేశారు. అలాగే, సంక్లిష్టమైన జీఎస్టీ నిబంధనలను తొలగిస్తేనే చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) నిజమైన ప్రయోజనం చేకూరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# ప్రద్యుమ్నతో నారా లోకేశ్ కు సంబంధాలున్నాయి: సజ్జల

యాక్టివిటీ లేని భీమ్ కంపెనీకి అసలు బ్యాంక్ ఖాతానే లేదని, అలాంటి కంపెనీ ద్వారా లావాదేవీలు ఎలా జరుగుతాయని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు లేని స్కామ్‌ను సృష్టించి, ప్రజల్లో విషం నింపేందుకు కట్టుకథలు అల్లుతున్నారని విమర్శించారు. సిట్ పేరుతో టీడీపీ, ఎల్లో మీడియా కలిసి కుట్రలు పన్నుతున్నాయని, తమ ప్రభుత్వ హయాంలో మద్యం పాలసీ అత్యంత పారదర్శకంగా ఉండేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని రైతుల సమస్యలపైనా సజ్జల స్పందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలోనే రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావాలనే యూరియాకు కృత్రిమ కొరత సృష్టించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో దివ్యాంగులకు ఇచ్చే పెన్షన్ల విషయంలో కూడా లంచాలు వసూలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. చంద్రబాబు, లోకేశ్ ఫేక్ వార్తలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, రాష్ట్ర సమస్యలను గాలికొదిలేసి విష ప్రచారానికే పరిమితమయ్యారని సజ్జల విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ ఈ నెల 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆర్డీవో కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు.

# యూనివర్సల్ హెల్త్ పాలసీకి ఏపీ కేబినెట్ ఆమోదం

అమరావతి: ఏపీ మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. యూనివర్సల్ హెల్త్ పాలసీ కి కేబినెట్ ఆమోదముద్ర వేసింది. రాష్ట్రంలోని ప్రజలందరికీ ఆరోగ్య బీమా కల్పిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం కొనసాగుతోంది. ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆయుష్మాన్ భారత్-ఎన్టీఆర్ వైద్యసేవా పథకం కింద యూనివర్సల్ హెల్త్ పాలసీకి మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీని ద్వారా ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.25లక్షల వరకూ ఉచిత చికిత్సలు అందేలా కొత్త విధానానికి ఆమోదముద్ర వేసింది. ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా అందరికీ హెల్త్ పాలసీ అమలయ్యేలా నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 1.63 కోట్ల కుటుంబాలకు ఆరోగ్య బీమా అందేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది.

జీఎస్టీ సంస్కరణలు.. కోట్ల కుటుంబాల కష్టాలను తొలగిస్తాయి: పవన్‌కల్యాణ్

2,493 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్య సేవలు పొందేలా ఎన్టీఆర్ వైద్యసేవ హైబ్రిడ్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేయనుంది. మొత్తం 3,257 చికిత్సలను హైబ్రిడ్ విధానంలో ఉచితంగా అందించనుంది. కేవలం ఆరు గంటల్లోనే వైద్య చికిత్సలకు అనుమతులు ఇచ్చేలా ప్రీ ఆథరైజేషన్ మేనేజ్‌మెంట్ చేయనున్నారు. రూ.2.5 లక్షలలోపు వైద్య చికిత్సల క్లెయిమ్‌లు ఇన్సూరెన్స్ కంపెనీల పరిధిలోకి వచ్చేలా కొత్త విధానం రూపొందించారు. రూ.2.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకూ వ్యయాన్ని ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ భరించనుంది. 1.43 కోట్ల పేద కుటుంబాలు, 20 లక్షల మంది ఇతర కుటుంబాలకూ వర్తించేలా నూతన విధానాన్ని తీసుకొస్తున్నారు.

కొత్తగా 10 వైద్య కళాశాలలకు ఆమోదం

మరోవైపు కొత్త వైద్యశాలల విషయంలోనూ మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. పీపీపీ విధానంలో రాష్ట్రంలో 10 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. రెండు దశల్లో ఆదోని, మదనపల్లె, మార్కాపురం, పులివెందుల, పెనుగొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురంలో వైద్య కళాశాలలు ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ఆర్ఎఫ్‌పీ జారీ చేసేందుకు మంత్రివర్గం అనుమతి ఇచ్చింది.

# జీఎస్టీ సంస్కరణలు.. కోట్ల కుటుంబాల కష్టాలను తొలగిస్తాయి పవన్‌కల్యాణ్

అమరావతి: జీఎస్టీ శ్లాబుల్లో సవరణ చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించారు. స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఎర్రకోట నుంచి ఇచ్చిన హామీని ప్రధాని మోదీ నెరవేర్చారని కొనియాడారు. ఈ మేరకు 'ఎక్స్'లో పవన్ పోస్ట్ చేశారు. "జీఎస్టీ భారాన్ని తగ్గించడం ద్వారా సంస్కరణలను ముందుకు తీసుకువచ్చారు. దీంతో పేద, మధ్యతరగతి, రైతులకు ఉపశమనం కలుగుతుంది. విద్య, బీమాపై జీఎస్టీని పూర్తిగా తొలగించడంతో ప్రజలపై భారం ఉండదు. పేదల భవిష్యత్తుకు మరింత భరోసా కల్పించడాన్ని స్వాగతిస్తున్నాను. ఈ సంస్కరణలు దేశంలోని కోట్ల కుటుంబాల కష్టాలను తగ్గిస్తాయి. ప్రజల సంక్షేమం కోసం సంస్కరణలు తెచ్చిన ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు జీఎస్టీ కౌన్సిల్‌కు నా కృతజ్ఞతలు. ఈ ఏడాది ప్రారంభంలో ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని పెంచారు. ఈ జీఎస్టీ సంస్కరణలు దేశానికి నిజమైన దీపావళి బహుమతిగా నిలుస్తాయి" అని పవన్ పేర్కొన్నారు.

# ఓనర్ రమణమ్మ గారూ.. రండి !

భద్రాద్రి కొత్తగూడెం: ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశంలో రిబ్బన్ కటింగ్‌కే సీఎం రేవంత్‌రెడ్డి పరిమితం కాలేదు. ఇంజనీర్ తరహాలో ప్రతీ గోడను పరిశీలించారు. ఎలా నిర్మించారు.. నాణ్యత ఉందా లేదా అని ఆరా తీశారు. నిర్మాణ నాణ్యతపై సంతృప్తి చెందిన సీఎం, ఇదే తరహాలో ఇతర చోట్ల కూడా నిర్మించాలని అధికారులకు సూచించారు.

ఓనర్ రమణమ్మ గారూ.. రండి !

బెండాలపాడులో గృహప్రవేశం సమయంలో పూజ పూర్తయిన వెంటనే కొబ్బరికాయ కొట్టే సమయంలో 'ఇంటి ఓనర్ రమణమ్మ గారూ.. రండి' అని సీఎం రేవంత్‌రెడ్డి పిలిచారు. ఇల్లు బాగుందని మెచ్చుకున్నారు. ఈ సమయంలో రమణమ్మ కూతురు లిఖితను ఏం చదువుతున్నావని ప్రశ్నించగా.. డిగ్రీ చదువుతున్నానని బదులిచ్చింది. బాగా చదువుకోవాలని సీఎం సూచించారు. అనంతరం ఆ ఇంటి ఆవరణలో కొబ్బరి మొక్క నాటి.. ఇది ఎంత ఎదిగితే మీ కుటుంబం అంత పచ్చగా ఉంటుందన్నారు. అనంతరం కుటుంబంతో ఫొటో దిగారు.

### ఏమైనా లోటుపాట్లు ఉన్నాయా ?

'నర్సమ్మా.. అంతా సంతోషమేనా, ఏమైనా లోటుపాట్లు ఉన్నాయా' అని రేవంత్‌రెడ్డి అడిగినప్పుడు 'మాకు అంతా మంచే జరిగింది సార్, మీరు రావడం మాకు చాలా సంతోషంగా ఉంది.. సీఎం సార్ వచ్చి మా ఇల్లు ఓపెన్ చేస్తారని అస్సలు అనుకోలేదు అంటూ ఆమె బదులిచ్చింది. అనంతరం ఇంట్లో చాప మీద కూర్చున్నాక ఇంటిని పరిశీలిస్తూ పిల్లర్లు వేసి కట్టారా లేక గోడ మీదనే శ్లాబ్ వేశారా అని అడిగారు. పిల్లర్లు వేసి కట్టామంటూ నర్సమ్మ కుటుంబ సభ్యులు చెప్పగా.. అలా కడితేనే ఇల్లు బాగా ఆగుతుందని సీఎం అన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డికి మక్క గారెలు, పాయసం అందించారు. నర్సమ్మ ఒడిలో ఉన్న ఆమె మనుమరాలు పాన్యశ్రీ వెన్నికకు సీఎం పాయసం తినిపించారు. 'నీ పేరేంటి, ఏ ఊరు' అని అడగగా.. ఆ చిన్నారి నమస్తే సార్ అంటూ బదులిచ్చింది. గృహ ప్రవేశం సందర్భంగా కుటుంబసభ్యులకు చీర, ప్యాంటు, షర్టులను ప్రభుత్వం తరఫున సీఎం అందించారు. తమ గ్రామానికి పీహెచ్‌సీ కావాలని సీఎంను కోరుదామనుకున్నామని, కానీ హడావుడిలో సాధ్యం కాలేదని ఇందిరమ్మ లబ్ధిదారులు తెలిపారు.

# పామాయిల్‌పై సుంకాల తగ్గింపుతో రైతులకు తీవ్ర నష్టం: భట్టి విక్రమార్క

దిల్లీ: రాష్ట్రంలోని ఆర్థిక పరిస్థితులు, రుణాలు తదితర అంశాలపై కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు కలిసి వివరించారు. పామాయిల్‌పై తగ్గించిన సుంకాల వల్ల రాష్ట్ర రైతులు తీవ్రంగా నష్టపోతారని వివరించినట్లు మంత్రులు తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న విద్యాసంస్థలకు ఆర్థిక సాయం అందించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలవబోతున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టం అంచనాలను కేంద్ర హోం మంత్రికి వివరించనున్నట్లు చెప్పారు.

# బెట్టింగ్ యాప్ కేసు.. క్రికెటర్ శిఖర్ ధవన్‌కు ఈడీ సమన్లు

ఢిల్లీ: టీమిండియా మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. అక్రమ బెట్టింగ్ యాప్‌తో ముడిపడి ఉన్న మనీ లాండరింగ్ కేసులో విచారణ కోసం గురువారం తమ ఎదుట హాజరు కావాలని ఆదేశించింది. అధికార వర్గాల కథనం ప్రకారం, 1xBet అనే అక్రమ బెట్టింగ్ యాప్‌కు సంబంధించిన కేసులో ఈ విచారణ జరుగుతోంది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద 39 ఏళ్ల ధావన్ వాంగ్మూలాన్ని ఈడీ అధికారులు నమోదు చేయనున్నారు. ఈ బెట్టింగ్ యాప్‌కు సంబంధించిన కొన్ని ప్రచార కార్యక్రమాల్లో ధావన్ పాల్గొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో, సదరు యాప్‌తో ఆయనకు ఉన్న సంబంధాలు, ఆర్థిక లావాదేవీలపై స్పష్టత కోసమే ఈడీ ఆయన్ను ప్రశ్నించాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఇలాంటి అక్రమ బెట్టింగ్ యాప్‌ల ద్వారా ప్రజల నుంచి కోట్లాది రూపాయలు కొల్లగొట్టడం, పన్నులు ఎగవేయడం వంటి పలు కేసులపై ఈడీ దేశవ్యాప్తంగా దర్యాప్తును ముమ్మరం చేసింది. ఇందులో భాగంగానే గత నెలలో మరో మాజీ క్రికెటర్ సురేశ్ రైనాను కూడా ఈడీ అధికారులు ప్రశ్నించిన విషయం తెలిసిందే. ఇప్పుడు శిఖర్ ధావన్‌ను కూడా విచారణకు పిలవడం ఈ కేసులో కీలక పరిణామంగా మారింది.

# పిఠాపురం నియోజకవర్గంలోని ఉపాధ్యాయులకు ప్రత్యేక కానుకలు పంపిన పవన్ కల్యాణ్

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఒకరోజు ముందుగానే ప్రారంభమయ్యాయి. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని పవన్ కల్యాణ్ తన నియోజకవర్గంలోని ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ప్రత్యేక బహుమతులు పంపి వారిని గౌరవించారు. నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న సుమారు 2 వేల మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఈ కానుకలు అందజేశారు. మహిళా టీచర్లకు చీరలు, పురుషులకు ప్యాంటు-షర్టు క్లాత్‌లను బహుమతులుగా అందించారు. ఈ ఉదయాన్నే పవన్ కల్యాణ్ ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు పిఠాపురం, కొత్తపల్లి, గొల్లప్రోలు మండలాల విద్యాశాఖ కార్యాలయాలకు చేరుకున్నాయి. అక్కడ ఈ బహుమతులను ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు పంపిణీ చేశాయి. తమ శాసనసభ్యుడు, డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న పవన్ కల్యాణ్ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తమను గుర్తుంచుకుని కానుకలు పంపడం పట్ల పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఆనందం వ్యక్తం చేశారు.

# మా బంధం దౌత్యానికి మించినది సింగపూర్‌పై మోదీ కీలక వ్యాఖ్యలు

ఢిల్లీ: భారత్, సింగపూర్ మధ్య సంబంధాలు కేవలం దౌత్యపరమైన అంశాలకే పరిమితం కాదని, ఇరు దేశాల భాగస్వామ్యం సాంప్రదాయ రంగాలను దాటి అత్యాధునిక సాంకేతిక రంగాల వైపు శరవేగంగా విస్తరిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో కలిసి గురువారం న్యూఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు పరస్పర ప్రయోజనాలే లక్ష్యంగా, శాంతి, శ్రేయస్సు అనే ఉమ్మడి దార్శనికతతో ముందుకు సాగుతున్నాయని మోదీ అన్నారు. సింగపూర్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత లారెన్స్ వాంగ్ భారత్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 60 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యత లభించింది. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, "భారత్ 'యాక్ట్ ఈస్ట్' విధానంలో సింగపూర్ ఒక కీలకమైన స్తంభం లాంటిది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం ఆసియాన్‌తో కలిసి పనిచేయడం కొనసాగిస్తాం" అని పేర్కొన్నారు. భవిష్యత్ భాగస్వామ్యం కోసం ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసినట్లు ప్రధాని వెల్లడించారు. ఇకపై సహకారం అధునాతన తయారీ, గ్రీన్ షిప్పింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటం టెక్నాలజీ, పట్టణ నీటి నిర్వహణ వంటి నూతన రంగాలకు విస్తరిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా సింగపూర్ సహకారంతో చెన్నైలో 'నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ స్కిల్లింగ్' ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కేంద్రం ద్వారా అధునాతన తయారీ రంగంలో అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను తీర్చిదిద్దుతామని వివరించారు. డిజిటల్ కనెక్టివిటీలో భాగంగా ఇప్పటికే విజయవంతమైన యూపీఐ-పేనౌ అనుసంధానంలో కొత్తగా మరో 13 భారతీయ బ్యాంకులు చేరినట్లు మోదీ తెలిపారు. ద్వైపాక్షిక సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందంతో పాటు, ఆసియాన్‌తో ఉన్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కూడా నిర్ణీత సమయంలో సమీక్షించాలని ఇరు దేశాలు నిర్ణయించాయని ఆయన పేర్కొన్నారు. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీ ఇరు దేశాల స్టాక్ మార్కెట్లను కలుపుతూ ఒక వారధిగా నిలుస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ఆగ్నేయాసియాలో సింగపూర్ భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అని, రక్షణ సంబంధాలు కూడా రోజురోజుకు బలపడుతున్నాయని ఆయన గుర్తు చేశారు.

# రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొత్త కారుపై జీఎస్టీ ఎత్తివేత.. ఎందుకంటే?

ఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధికారిక ప్రయాణాల నిమిత్తం కొనుగోలు చేయనున్న అత్యంత భద్రత కలిగిన నూతన బీఎండబ్ల్యూ కారుకు పన్నుల నుంచి పూర్తి మినహాయింపు లభించింది. రూ.3.66 కోట్ల విలువైన ఈ బుల్లెట్ ప్రూఫ్ వాహనంపై విధించాల్సిన ఐజీఎస్టీ, కాంపెన్సేషన్ సెస్సును రద్దు చేస్తూ జీఎస్టీ కౌన్సిల్ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రపతి వాహనం ఒక విలాసవంతమైన వస్తువు కాదని, దేశ భద్రతకు సంబంధించిన వ్యూహాత్మక ఆస్తి అనే ప్రత్యేక కారణంతో ఈ వెసులుబాటు కల్పించారు. సాధారణంగా ఇలాంటి విదేశీ కార్ల దిగుమతిపై 28 శాతం ఐజీఎస్టీతో పాటు కస్టమ్స్ సుంకం, అదనపు సెస్సులు భారీగా ఉంటాయి. అయితే, రాష్ట్రపతి భద్రత దృష్ట్యా ఈ వాహనం అత్యంత ఆవశ్యకమని భావించిన జీఎస్టీ కౌన్సిల్ ఫిట్‌మెంట్ కమిటీ, పన్ను మినహాయింపు కోసం ప్రతిపాదించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులతో కూడిన జీఎస్టీ కౌన్సిల్ ఈ ప్రతిపాదనను ఆమోదించింది. దీంతో రాష్ట్రపతి సచివాలయం ఎటువంటి పన్ను భారం లేకుండా ఈ వాహనాన్ని సమకూర్చుకోనుంది. ప్రస్తుతం రాష్ట్రపతి కాన్వాయ్‌లో మెర్సిడెస్ బెంజ్ ఎస్600 పుల్‌మ్యాన్ గార్డ్ లిమోసిన్ వాహనాన్ని వినియోగిస్తున్నారు. దీని స్థానంలో ఇప్పుడు అత్యాధునిక బీఎండబ్ల్యూ సెడాన్ చేరనుంది. ప్రస్తుతం వాడుతున్న కారులో బుల్లెట్ల నుంచి, పేలుళ్ల నుంచి రక్షణ కల్పించే వ్యవస్థలు, మల్టీ లేయర్ బుల్లెట్ ప్రూఫ్ గ్లాస్, దాడులు జరిగినప్పుడు దానంతట అదే మూసుకుపోయే ఫ్యూయల్ ట్యాంక్, ప్రత్యేక ఆక్సిజన్ సరఫరా వ్యవస్థ వంటివి ఉన్నాయి. కొత్తగా రాబోయే బీఎండబ్ల్యూ కారులో ఇంతకంటే అధునాతన భద్రతా ప్రమాణాలు ఉంటాయని అంచనా వేస్తున్నారు. ఇలాంటి పన్ను మినహాయింపులు చాలా అరుదని, కేవలం ప్రజా ప్రయోజనాల దృష్ట్యా, ప్రత్యేక కేసుల్లో మాత్రమే ప్రభుత్వం అనుమతిస్తుందని అధికారులు తెలిపారు.

# రష్యా, చైనాలను ఎదుర్కోవడానికి సైన్యాన్ని సన్నద్ధం చేయండి: పెంటగాన్ కు ట్రంప్ ఆదేశాలు



ఢిల్లీ: అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. తమ ప్రధాన ప్రత్యర్థులైన రష్యా, చైనాలను నిలువరించేందుకు సైనిక సన్నద్ధతను గణనీయంగా పెంచాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రక్షణ శాఖకు (పెంటగాన్) స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌లు బీజింగ్‌లో సమావేశమైన నేపథ్యంలో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. అమెరికాకు వ్యతిరేకంగా ఈ మూడు దేశాల మధ్య బంధం బలపడుతోందనడానికి ఈ భేటీ ఒక సంకేతమని వాషింగ్టన్ భావిస్తోంది. ఈ ఆదేశాలను పెంటగాన్ చీఫ్ పీట్ హెగ్సెత్ ధృవీకరించారు. అయితే, ఈ చర్యలు యుద్ధాన్ని కోరుకోవడం కోసం కాదని, కేవలం "యోధుల స్ఫూర్తిని పునరుద్ధరించడం" కోసమేనని ఆయన ఫాక్స్ న్యూస్‌కు తెలిపారు. ఆయన మాట్లాడుతూ, "గత ప్రభుత్వ బలహీన విధానాల వల్లే దురదృష్టవశాత్తు రష్యా, చైనాలు దగ్గరయ్యాయి. అమెరికా నాయకత్వ లోపానికి ఇది నిదర్శనం. అందుకే మా సైన్యాన్ని పునర్నిర్మించి, నిరోధక సామర్థ్యాన్ని తిరిగి వ్యవస్థీకరించడానికి సిద్ధంగా ఉండాలని అధ్యక్షుడు ట్రంప్ ఆదేశించారు" అని వివరించారు. "మేము సంఘర్షణను కోరుకోవడం లేదు. యుద్ధాన్ని నివారించడానికి సిద్ధంగా ఉన్నాం అని చైనా, రష్యా సహా ఇతర దేశాలకు మేం స్పష్టం చేశాం" అని హెగ్సెత్ అన్నారు. మరోవైపు, రెండో ప్రపంచ యుద్ధం ముగిసి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బీజింగ్‌లో భారీ సైనిక పరేడ్‌ను నిర్వహించారు. ఈ పరేడ్ ను జిన్‌పింగ్ సహా పుతిన్, కిమ్ వీక్షించారు. ఈ నేపథ్యంలో చైనా, రష్యా, ఉత్తర కొరియా దేశాలు ఏకమై అమెరికాకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని ట్రంప్ నేరుగా ఆరోపించారు. ట్రంప్ తాజా ఆదేశాలతో అమెరికా సైన్యంలో భారీ మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని... భవిష్యత్తులో మాస్కో, బీజింగ్‌ల నుంచి ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రత్యేక వ్యూహాలు అమలు చేయనున్నారని తెలుస్తోంది.

# శాఖల మధ్య సమన్వయంతోనే వరద నష్టాలను తగ్గించగలం



కొడంగల్‌కు ఎంత మేరకు సాయం చేస్తానో కామారెడ్డి జిల్లాకు కూడా అంత సాయం చేస్తానని మాటిచ్చారు. వరద నష్టంపై గ్రామాల వారిగా అంచనాలు రూపొందించి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని చెప్పారు. దెబ్బతిన్న రహదారులు, బ్రిడ్జీలు, మైనర్, మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులతో పాటు పంట నష్టానికి సహాయం అందిస్తామన్నారు. ఇటీవలి భారీ వర్షాల కారణంగా కామారెడ్డి జిల్లాలో దెబ్బతిన్న ప్రాంతాల్లో ముఖ్యమంత్రి గారు పర్యటించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారు, ధనసరి అనసూయ సీతక్క గారు, ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ గారు, సలహాదారు షబ్బీర్ అలీ గారు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ గారు, ఎమ్మెల్యేలు మదన్ మోహన్ రావు గారు, తోట లక్ష్మీ కాంతారావు గారు, కాటిపల్లి వెంకట రమణారెడ్డి గార్లతో ఆయా ప్రాంతాలను పరిశీలించారు. "వందేళ్లలో ఎప్పుడూ రానంత వరద వచ్చింది. నష్టపోయిన వారిని ప్రభుత్వం కచ్చితంగా ఆదుకుంటుంది. అన్ని సమస్యలు పరిష్కరించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తిస్థాయిలో వరదల నష్టాన్ని అంచనా వేయాలి. పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తాం. రోడ్లు, ప్రాజెక్టులను మరమ్మతులు చేసేందుకు కూడా అంచనాలు రూపొందించాలి" అని అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. "వరదల వల్ల ఆస్తినష్టం, ప్రాణ నష్టం జరగకుండా ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు గారు ప్రజలకు అండగా నిలిచారు. కష్టం వచ్చినప్పుడు అండగా ఉండే వారే నిజమైన నాయకుడు. ఎమ్మెల్యే గారి లాగే కష్టాల్లో ఉన్నప్పుడు ప్రజలకు తోడుగా ఉండాలని నాయకులకు సూచిస్తున్నా. వరదలకు మైనర్, మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు దెబ్బతిన్నాయి. పోచారం ప్రాజెక్టు భారీ వరదను కూడా తట్టుకుని నిలబడి అందర్నీ కాపాడింది. తాత్కాలిక మరమ్మతులు చేశాం. అయితే ప్రజలు ఎదుర్కొన్న కష్టాలు, జరిగిన నష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలించడానికే ఇక్కడికి వచ్చాం. నష్టపోయిన వారిని అన్ని విధాలుగా ఆదుకుంటాం.." అని ముఖ్యమంత్రి గారు బాధితులకు భరోసానిచ్చారు. మొదట తాడ్వాయి మండలం ఎర్రపహాడ్ చేరుకున్న ముఖ్యమంత్రి గారు ప్రజాప్రతినిధులతో కలిసి వరదల వల్ల దెబ్బ తిన్న ప్రాంతాలను పరిశీలించారు. వరదల వల్ల లింగంపేటలో దెబ్బతిన్న ఆర్ అండ్ బి బ్రిడ్జీని పరిశీలించారు. వరదలు వచ్చిన సందర్భంగా ఉత్పన్నమైన పరిస్థితులపై అక్కడ ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అక్కడ స్థానికులను ఉద్దేశించి మాట్లాడారు. పరిస్థితిని పరిశీలించిన అనంతరం తాత్కాలిక మరమ్మతులతో కాకుండా బ్రిడ్జి నిర్మాణానికి పూర్తిస్థాయి ప్రణాళికలు తయారు చేయాలని ముఖ్యమంత్రి గారు అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం కోసం బ్రిడ్జి కమ్ బ్యారేజీ లేదా బ్రిడ్జి కమ్ చెక్ డ్యామ్ తరహాలో నిర్మించేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని చెప్పారు. బ్రిడ్జి నిర్మాణానికి పూర్తి స్థాయి అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కామారెడ్డి జీఆర్ కాలనీ సందర్శించిన సందర్భంగా ముఖ్యమంత్రి గారు బాధితులతో మాట్లాడారు. మరణించిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున, పశుసంపద కోల్పోయిన వారికి సాయం అందించాలని ఆదేశించారు. "భారీ వర్షాలు, వరదల వల్ల ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఆస్తినష్టం జరిగినప్పటికీ అప్రమత్తంగా ఉండటం ప్రాణ నష్టం తగ్గించగలిగాం. వరదలు రాగానే క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందిగా జిల్లా ఇంచార్జీ మంత్రి సీతక్క గారిని, సలహదారు షబ్బీర్ అలీ గారిని, ఎంపీ సురేష్ షేట్కర్ గారిని, ఎమ్మెల్యేలను ఆదేశించాను. ఎప్పటికప్పుడు అవసరమైన సూచనలు చేశా. ఇక్కడి సమస్యల పరిష్కారానికి వంద శాతం ప్రభుత్వం కృషి చేస్తుంది. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, ఇతర సామగ్రిని అందించేందుకు చర్యలు తీసుకుంటాం.." అని ముఖ్యమంత్రి గారు స్పష్టంగా చెప్పారు. కామారెడ్డి చేరుకునే సమయంలో ముఖ్యమంత్రి గారు హెలికాప్టర్ ద్వారా జిల్లాలో నష్టపోయిన ప్రాంతాలను ఏరియల్ సర్వే ద్వారా వీక్షించారు.

# వనపర్తి జిల్లాలో యూరియా కొరత లేదు రైతులకు ప్రస్తుత అవసరాల మేరకు ఇవ్వండి

### రెండవ సారి వేయాల్సిన యూరియాను ముందుగానే కొనుక్కోవడం సరికాదు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి జిల్లా ప్రతినిధి (భారత్ రిపోర్టర్ ) వనపర్తి జిల్లాలో గత సంవత్సరం కంటే ఎక్కువ యూరియా అందుబాటులో ఉందని రైతులు అనవసర అనుమానంతో పంటకు రెండవసారి వేయాల్సిన యూరియా సైతం ఇప్పుడే కొని పెట్టుకోవాలి అనుకోవడం వల్ల మిగతా రైతులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు



గురువారం వనపర్తి మండలం పెద్ద గూడెం గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదామును కలెక్టర్ తనిఖీ చేశారు రికార్డుల ప్రకారం వాస్తవిక యూరియా నిల్వలను పరిశీలించారు పి. ఏ.సి.ఎస్ చైర్మన్లు సకాలంలో యూరియా కొరకు డి.డి.లు కట్టి రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారుఅనంతరం అక్కడే రైతులతో మాట్లాడారు ఇంకా ఒక లోడ్ యూరియా తెప్పిస్తే ఈ ప్రాంతంలో అందరికీ సరిపోతుందని రైతులు కలెక్టర్ కు సూచించారు స్పందించిన కలెక్టర్ వనపర్తి జిల్లాలో గత సంవత్సరం కంటే ఎక్కువ యూరియా వచ్చిందని పాత నిల్వలు సైతం ఉన్నాయన్నారు కేవలం మళ్ళీ యూరియా దొరుకుతుందో లేదో అనే భద్యాందోళనతో కొంతమంది రైతులు ప్రస్తుత అవసరానికి మించి కొనడం వల్ల ఇతర రైతులకు ఇబ్బందులు కలుగుతుందన్నారు మలి దఫా వేయాల్సిన యూరియా సైతం ఇప్పుడే కొని పెట్టుకోవడం సరి కాదన్నారు యూరియా నిరంతరం వస్తూనే ఉంటుంది కాబట్టి రైతుకు అనవసర ఆందోళన పడి ఉదయాన్నే లైన్లో వేచి ఉండాల్సిన పని లేదన్నారు జిల్లాలో గత సంవత్సరం ఇంతకన్నా తక్కువ యూరియా ఉండిందని కానీ ఎక్కడ సమస్య తలెత్తలేదన్నారు ఇప్పుడు ఎక్కువ యూరియా అందుబాటులో ఉన్నప్పటికీనీ సమస్యలు రావడం ఏమిటని అన్నారు ఇప్పుడు ఎంత అవసరమో అంత మాత్రమే తీసుకెళ్లాలని తర్వాత మళ్ళీ తీసుకోవచ్చని రైతులకు భరోసా కల్పించారుజిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు గౌడ్ వనపర్తి తహసీల్దార్ రమేష్ రెడ్డి మండల వ్యవసాయ అధికారి పి. ఎ సి.ఎస్ సిబ్బంది రైతులు కలెక్టర్ వెంట ఉన్నారు

# మధుమేహం క్షయ వ్యాధిగ్రస్తుల ప్రయోజనార్థం రూపొందించిన హెల్త్ యాప్ ను రోగులతో పాటు వైద్యులు సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి జిల్లా ప్రతినిధి (భారత్ రిపోర్టర్ ) జిల్లాలోని మధుమేహం క్షయ వ్యాధిగ్రస్తుల విస్తృత ప్రయోజనార్థం రూపొందించిన వనపర్తి హెల్త్ యాప్ ను రోగులతో పాటు వైద్యులు సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారుగురువారం కలెక్టర్ వనపర్తి మండలం కడుకుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నమోదు అయి ఉన్న మధుమేహం క్షయ వ్యాధి గ్రస్తుల వివరాలు వనపర్తి హెల్త్ యాప్ లో తనిఖీ చేశారు ప్రతి ఒక్కరి వివరాలు సరిగ్గా నమోదు చేయాలని వారి మొబైల్ నెంబరు వివరాలు సరిగ్గా ఉన్నాయా లేవా అనేది ఆశా వర్కర్ల ద్వారా ఇంటింటికి తిరిగి తనిఖీ చేయించాలని ఆదేశించారు అన్నివివరాలు సరిగ్గా ఉండాలని మధ్యలో వారు తీసుకున్న వైద్య చికిత్స వివరాలు ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని సూచించారు అదేవిధంగా ఈ యాప్ లో లెప్రసి వ్యాధిగ్రస్తుల వివరాలు హెచ్.ఐ.వి వ్యాధిగ్రస్తుల వివరాలు సైతం అప్లోడ్ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు యాప్ లో అప్లోడ్ చేసిన ప్రతి ఒక్కరికి ఆయుష్మాన్ భారత్ హెల్త్ గుర్తింపు కార్డు ఉండే విధంగా వివరాలు నమోదు చేయాల్సిందిగా ఆదేశించారు జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వనపర్తి హెల్త్ యాప్ లో ఇదే విధమైన వివరాలు నమోదు చేసేవిధంగా చూడాలని జిల్లా వైద్య అధికారిని ఆదేశించారు అనంతరం పి.హెచ్.సి లో వైద్యం పొందుతున్న బాలింతలతో కలెక్టర్ మాట్లాడారు వైద్య సేవలు ఎలా వున్నాయి ఇక్కడ కనీస మౌలిక సదుపాయాలు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు పి.హెచ్.సి లో మంచి వైద్య సేవలు ఉన్నాయని ఇబ్బందులు లేవని రోగులు సమాధానం ఇచ్చారు ఆసుపత్రికి అవసరమైన మరమ్మతులు ఏమైనా ఉంటే ప్రతిపాదనలు ఇవ్వాలని వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని వైద్య అధికారిని సూచించారు జిల్లా వైద్య అధికారి డాక్టర్ శ్రీనివాసులు ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సాయినాథ్ రెడ్డి డాక్టర్ పరిమళ వనపర్తి మండల తహసిల్దార్ రమేష్ రెడ్డి తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు

# మండలమైంది కానీ.. మౌలిక వసతుల మాటేమి..?

### మండల కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలి అధికార పార్టీ నాయకుడి నల్ల మట్టి అక్రమ దందా మైనింగ్స్ ను అరికట్టాలి :బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్



చిన్నంబావి మండలం భారత్ రిపోర్టర్ :చిన్నంబావి మండలం ఏర్పడి తొమ్మిదేళ్లు కావస్తున్నా కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదని...ఇకనైనా మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక దృష్టి సారించి మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.గురువారం చిన్నంబావి మండల కేంద్రంలో పర్యటించిన ఆయన అద్దె భవనంలో నడుస్తున్న తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసిల్దార్ తో మండల సమస్యలపై మాట్లాడిన అనంతరం సంత జరిగే ప్రాంతాన్ని, అక్కడి వసతులను పరిశీలించి వ్యాపారులు, ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కనీసం పంచాయతీ కూడా కాని చిన్నంబావిని మండలం చేశారు కానీ...మౌలిక వసతులు కల్పించడంలో మాత్రం మర్చిపోయారన్నారు.మండల కార్యాలయాలు అన్నీ ఇప్పుడు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయని,ఇంటిగ్రేటెడ్ మండల అధికారుల భవనాన్ని వెంటనే నిర్మించాలని కోరారు.ఇక్కడ దేవాదాయ భూములను ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులు కబ్జా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని, దీన్ని నిర్మూలించడంతో పాటు దేవాదాయ భూముల సర్వే చేసి తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు.ఇక్కడ వేసవి వేస్తే ఓ అధికార పార్టీ నాయకుడు నల్ల మట్టి అక్రమ దందా చేయడమే గాక రైతులను అడ్డుపెట్టుకొని సింపతి సాధిస్తున్నాడని, ఆ నాయకుడి అక్రమ దందాను మైనింగ్, అరికట్టాలని పోలీసు శాఖకు విజ్ఞప్తి చేశారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మండల కేంద్రంలో వెంటనే ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు.మండల కేంద్రంలో బస్టాండు లేకపోవడంతో ప్రజలు ఎండకు, వర్షానికి రోడ్డుమీద నిలబడి బస్సుల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి ఉందని, ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండు నిర్మించాలని కోరారు.ఇక్కడ మూడేళ్ల కిందట సంత ఏర్పాటు చేశారని, మండలంలోని 17 గ్రామ పంచాయతీల నుంచి ప్రజలు సంతకు వస్తుంటారని కానీ ఇక్కడ తాగునీరు మరియు టాయిలెట్స్ లేకపోవడంతో వ్యాపారులతో పాటు ఇక్కడికి వచ్చే ప్రజలు ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మంత్రి జూపల్లి కృష్ణారావు మరియు జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి మండల కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి నాయకులు వివి గౌడ్, బత్తుల జితేందర్, రాఘవేందర్ గౌడ్, నాగరాజు, యశ్వంత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



# గణనాథుల నిమజ్జనం ఘనంగా పండుగ వాతావరణంలో ప్రశాంతంగా జరుపు కోవాలి

### నిమజ్జనం ఊరేగింపు సమయంలో డీజేలు, బాణాసంచా కాల్చడం వంటివి నిషేధం



వనపర్తి జిల్లా ప్రతినిధి (భారత్ రిపోర్టర్ ) గణేష్ ఉత్సవ కమిటీలు త్వరితగతిన పూజలు ముగించి వెలుతురు ఉండగానే తమ విగ్రహాలను జాగ్రత్తగా తరలించాలనిసిసి కెమెరాల నిఘాలో గణేష్ నిమజ్జన శోభాయాత్రకు ఏర్పాట్లు చేశామన్నారుపోలీసు అధికారులు సిబ్బందితో శోభాయాత్రకు పటిష్ఠ బందోబస్తుచేశామన్నారుజివనపర్తి జిల్లాలో ఈనెల 5వతేదీన వినాయక నిమజ్జనాలు భక్తిప్రపత్తులతో పరస్పర సహకారంతో శోభాయాత్రలు నిర్వహించి గణపయ్యలకు జిల్లావ్యాప్తంగా ఘనమైన వీడ్కోలు పలుకుదామని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు గణేశ్ నవరాత్రులు ముగించుకొని వనపర్తి జిల్లాలో వివిధ ప్రాంతాల వద్ద నిమజ్జనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఎలాంటి అవాంచనియా సంఘటనలు ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన భద్రత బందోబస్త్ ఏర్పాట్లు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు గురువారం రోజు వనపర్తి పట్టణం నల్లచెరువు వద్ద నిమజ్జనం జరిగే ప్రదేశాన్ని నిమజ్జన శోభయాత్ర జరిగే రూట్ ను జిల్లా ఎస్పీ ఇతర ప్రభుత్వశాఖల అధికారులతో కలిసి సందర్శించారుఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిమజ్జన సమయంలో పోలీసు వారి యొక్క సూచనలకు అనుగుణముగా నిర్వాహకులు ఉత్సవ కమిటీ సభ్యులు నడుచుకొని ప్రశాంతముగా నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యేలా సహాయ సహకారాలు అందించాలని కోరారు పోలీసుశాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసి పోలీసు పికెట్లు ఇతర ప్రభుత్వశాఖల సమన్వయంతో రోడ్ల మరమ్మత్తు ఫ్లడ్ లైట్లు క్రేన్లు మంచినీటి వసతి ఏర్పాటు చేశామని నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో గజఈతగాళ్ల అందుబాటులో ఉంటారన్నారు ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లను చేయడం జరిగింది అన్నారు అన్ని ప్రాంతాలలో సీసీ కెమెరాల పర్యవేక్షణలో గణేష్ నిమజ్జన ఊరేగింపు ఉంటుందన్నారు గణేష్ ఉత్సవ కమిటీలు త్వరితగతిన పూజలు ముగించి వెలుతురు ఉండగానే తమ విగ్రహాలను జాగ్రత్తగా తరలించాలని ఊరేగింపులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని చిన్న పిల్లలు మహిళలు శోభ యాత్రలో పాల్గొంటే ప్రమాదాలు జరగకుండా చూడాలని అలాగే ట్రాక్టర్ల లారీలపై ఇతర వాహనాలపై వచ్చే చిన్నారులు జాగ్రత్తగా ప్రయాణించాలని కాళ్లు చేతులు క్రిందకు వేలాడస్తు ప్రయాణం సాగించవద్దని పొరపాటున కాలుజారి పడిపోతే ప్రమాదం సంభవిస్తుందని అన్నారు నిమజ్జనం సమయంలో క్రేన్ సహాయంతో నిమజ్జనం చేసే సమయంలో యువత చిన్నారులు మహిళలు అప్రమత్తంగా ఉండాలని సహాయకులు అందుబాటులో ఉండాలని అన్నారు నిమజ్జనం సందర్భంగా ఊరేగింపు సమయంలో డీజేలు బాణాసంచా కాల్చడం వంటివి నిషేధమని సూచించారు నిమజ్జనానికి వస్తున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా రద్దీగా ఉండే ప్రదేశాలలో ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవడం జరిగింది అన్నారు ముఖ్యంగా ఉత్సవ కమిటీ సభ్యులు బాధ్యతగా నియమ నిబంధనలను పాటిస్తూ పోలీసువారి సూచనలను పాటించాలని కోరారు చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు భక్తిశ్రద్ధలతో నవరాత్రులను ముగించుకొని ఆఖరున జరిగే నిమజ్జన కార్యక్రమాన్ని మత సామరస్యంతో శాంతియుత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు వనపర్తి సీఐ కృష్ణయ్య రిజర్వ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ వనపర్తి పట్టణ ఎస్సై హరిప్రసాద్ మున్సిపల్ సిబ్బంది పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు



# ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన చెక్కును అందజేసిన... పోలవరం బ్యాంక్ మేనేజర్ రవికుమార్



పోలవరం సెప్టెంబర్ 4 (భారత్ రిపోర్టర్)పోలవరం మండలం భారతీయ స్టేట్ బ్యాంక్ మేనేజర్ రవికుమార్ ఆధ్వర్యంలో పోలవరం మండలంలోని నూతన గూడెం గ్రామానికి చెందిన లింగోజు దుర్గాదేవి కుటుంబానికి ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన చెక్కును అందజేశారు. పోలవరం మండలం నూతన గూడెం గ్రామానికి చెందిన లింగోజు దుర్గాదేవి అనే ఆమె పోలవరం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకులో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన ఇన్సూరెన్స్ చేయించడం ద్వారా ఇటీవల లింగోజు దుర్గాదేవి అనారోగ్యంతో మృతి చెందడంతో నామిని కుమారి హేయశ్రీ సాయి కుమార్తెకు తాతయ్య లింగోజు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో రెండు లక్షల చెక్కును బ్యాంక్ మేనేజర్ రవికుమార్ అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ రవికుమార్ మాట్లాడుతూ.. బ్యాంక్ లో ప్రతి ఖాతాదారుడు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పింఛన్ యోజన అందుబాటులో ఉన్నాయని, బ్యాంక్ సేవలు వినియోగించుకోవాలని ఖాతాదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ జగదీష్, సిబ్బంది ఉన్నారు.

# చేగొండపల్లి గ్రామంలో అన్న సమరాదన కార్యక్రమంలో పాల్గొన్న... ఏపీస్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి, విజయ నాయక్ దంపతులు , కమిటీ సభ్యులు



పోలవరం సెప్టెంబర్ 4 (భారత్ రిపోర్టర్)పోలవరం మండలం చేగొండపల్లి గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా చేగొండపల్లి గణపతి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం రోజు అన్నదాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పోలవరంఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి పాల్గొన్నారు. ముందుగా గ్రామ, మండల, నియోజకవర్గ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ఆయన స్వయంగా భక్తులకు వడ్డించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో సుమారు 2000 మంది భక్తులు అన్న ప్రసాదాలు స్వీకరించారని కమిటీ సభ్యులు తెలియజేశారు. అనంతరం లడ్డు పాటను నిర్వహించారు లడ్డు వేలం పాటను చేగొండపల్లి గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్ 20 వేల రూపాయలకు దక్కించుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజల అధిక సంఖ్యలో పాల్గొన్నారు



# పట్టిసీమ ఫెర్రీ రేవులో గణపతి విగ్రహాల నిమజ్జనం...



పోలవరం సెప్టెంబర్ 4(భారత్ రిపోర్టర్ )పోలవరం మండలంలో గణపతి నవరాత్రుల సందర్భంగా గణపతి విగ్రహాలను గురువారం భారీ ఊరేగింపు నిర్వహించి పట్టిసీమ ఫెర్రీ రేవులో నిమజ్జనం చేశారు. మండలంలో 13 భారీ గణపతి విగ్రహాలను ట్రాక్టర్లపై తీన్మార్ వాయిద్యాలతో ఊరేగించి కోలాటాలతో ఘనంగా నిమజ్జనం చేశారు.

# అనుగొండ గణనాథుని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం



మక్తల్ నియోజకవర్గం ప్రతినిధి (భారత్ రిపోర్టర్ ) నారాయణ పేట్ జిల్లా మక్తల్ మండల పరిధిలోని అనుగొండ గ్రామంలో ఆ గ్రామ యువజన సంఘం వారు ఏర్పాటుచేసిన మండపంలో గురువారం నాడు మాజీ శాసనసభ్యులు చిట్టెం రామ్మోహన్ రెడ్డి గణనాథుని దర్శించుకోవడం జరిగినది అంతకుముందు జరిగిన గణనాథుని హోమం కార్యక్రమం పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు అనంతరము ఒక నిర్వాహకులు ఏర్పాటుచేసిన అన్న ప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభం చేశారు ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి నరసింహ గౌడ్, నిర్వాహకులు సతీష్, నారాయణ, అనిల్, మాజీ ఎంపీపీ గడ్డంపల్లి హనుమంతు, మాజీ సర్పంచి రమేష్,వీరన్న, శ్రీనివాసులు, తిరుపతి, టిఆర్ఎస్ నాయకులు సందపురం అశోక్ కుమార్ గౌడ్, శివారెడ్డి,గాలి రెడ్డి,అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

# జాతీయ స్థాయి క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు ప్రశంస పత్రాల అందించిన గోపాల్



మక్తల్ నియోజకవర్గ ప్రతినిధి (భారత్ రిపోర్టర్ ) నారాయణపేట జిల్లా ఊట్కూర్ సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు ఆర్. కళ్యాణి, కావలి హేమలత 44వ జాతీయస్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ క్రీడలకు ఎంపికై, తెలంగాణ రాష్ట్ర జట్టు తరుపున గత నెల 20 నుండి 25 వరకు బీహార్ రాష్ట్ర బుద్ధ గయ నగరంలో జరిగిన జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొని నాలుగో స్థానం సంపాదించి ప్రశంసా పత్రాలు పొందిన, జాతీయస్థాయి క్రీడాకారిణులైన ఆర్. కళ్యాణి, కె. హేమలత లను తెలంగాణ షూటింగ్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బి.గోపాలం, జిల్లా అధ్యక్షుడు సత్య ఆంజనేయులు సెప్టెంబర్ 4న గురుకుల పాఠశాలలో రాష్ట్ర, జాతీయ స్థాయి సర్టిఫికెట్స్, మెడల్స్ అందజేసి ఘనంగా సన్మానించి, అభినందించారు. జాతీయస్థాయి క్రీడాకారిణులు మాట్లాడుతూ, కోచ్ బి.గోపాలం, పి ఈ టి లావణ్య షూటింగ్ బాల్ క్రీడల్లో క్రీడా మెలకువలు నేర్పించి, మెరుగైన శిక్షణ ఇచ్చినందుకు మేము జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్నమని వారు సంతోషాన్ని వ్యక్తపరిచారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ మంజుల మాట్లాడుతూ, మొదటిసారిగా మా విద్యార్థినులు జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొనడం , గత నెల 29న జాతీయస్థాయి క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ ద్వారా గణ సన్మానం పొందడం చాలా ఆనందంగా ఉందని, బాలికలను అభినందిస్తూ, వారికి, క్రీడలకు పూర్తి సహకారం అందిస్తానని ఆమె సంతోషాన్ని వ్యక్తపరుస్తూ, షూటింగ్ బాల్ బాధ్యులయిన బి.గోపాలంను, సత్య ఆంజనేయులు ను ఘనంగా సన్మానించి, అభినందించి, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.గోపాలం, జిల్లా అధ్యక్షుడు సత్య ఆంజనేయులు, పాఠశాల ప్రిన్సిపల్ మంజుల, పిఈటిలు లావణ్య, మంజుల, సీనియర్ ఉపాధ్యాయురాలు పద్మ, ఉపాధ్యాయ బృందము, విద్యార్థినులు పాల్గొన్నారు



# అంబేద్కర్ నగర్ యూత్ గణేశున్ని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి



మక్తల్ నియోజకవర్గ ప్రతినిధి (భారత్ రిపోర్టర్ ) నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణం అంబేద్కర్ నగర్ లో అంబేద్కర్ యువజన సంఘం యూత్ గణేశ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపంలో మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ,ప్రత్యేకపూజలునిర్వహించారు.అనంతరం కమిటీ సభ్యులు చిట్టెం రాంమోహన్ రెడ్డి సన్మానించారుఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ నరసింహ గౌడ్,టౌన్ ప్రెసిడెంట్ చిన్న హనుమంతు,గాల్ రెడ్డి,ఈశ్వర్ యాదవ్,నేతాజీరెడ్డి,జె.సాగర్,శివారెడ్డి,అశోక్ యాదవ్,చందాపూర్ అశోక్ గౌడ్,మరియు గణేష్ ఉత్సవ కమిటీసభ్యులుజనార్ధన్,దామోదర్,నాని,పవన్,రాకేష్,మహేష్,విజయ్,దినేష్,హన్మంతు,వెంకటేష్,మరియు కమిటీ యువకులు పాల్గొన్నారు

# మనమిత్ర వాట్సప్ గవర్నన్స్ పై ప్రజలకు అవగాహన కల్పించండి..!




వాకాడు/సెప్టెంబర్,04(భారత్ న్యూస్):తిరుపతి జిల్లా వాకాడు మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయం సిబ్బంది ఇంటింటికి వెళ్లి వాట్సప్ గవర్నర్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించవలెనని ఎంపీడీవో శ్రీనివాసులు తెలియజేశారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీడీవో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 6వ తేదీ శనివారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది తప్పనిసరిగా ప్రతి ఇంటికి వెళ్లి ఒక్క సర్వీస్ అయిన తప్పనిసరిగా చేయాలని సూచించారు, మనమిత్ర వాట్సప్ గవర్నన్స్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమం కు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది ఎలాంటి సెలవులు మంజూరు చేయడం జరగదని, అంతేకాక అన్ని శాఖల పరిధిలోని అందరూ సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనాలని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు.

Postal Licenced No: HDP/010/2024-2026
భారత్ రిపోర్టర్ — తెలుగు దినపత్రిక
RNI.APTEL/2023/88573
BHARATH REPORTER



# : జై బోలో గణేష్ మహారాజ్ కి జై మారబోయిన రవి యాదవ్.

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న రవి యాదవ్



శేరిలింగంపల్లి :(భారత్ రిపోర్టర్) సెప్టెంబర్: 04 శేరిలింగంపల్లి నియోజకవర్గం గోపినగర్ లో పలు గణేష్ మండపాలకి లచ్చగొని శ్రీకాంత్ యాదవ్ మరియు రమేష్ పిలుపు మేరకు ముఖ్య అతిథిగా మారబోయిన రవి యాదవ్ రావడం జరిగింది. మారబోయిన రవి యాదవ్ మాట్లాడుతూ, గణేష్ ఉత్సవం అంటేనే కుల మత బేధాలు లేకుండా చిన్న పెద్దా అని తేడా లేకుండా అందరూ కలిసి చేసుకునే పండగనే ఈ గణేష్ ఉత్సవం. ఏ మంచి పని మొదలుపెట్టిన ముందుగా పూజ చేసేది గణనాథునికే భారతదేశంలోని ప్రజలు అంతా సుఖ సంతోషాలతో అష్ట ఐశ్వర్యాలతో అందరూ బాగుండాలని బొజ్జ గణపయ్యకి ప్రత్యేక పూజలు నిర్వహించాము అని అన్నారు. అన్నదాన ప్రసాదంలో మారబోయిన రవి యాదవ్ పాలుగోన్ని దగ్గరుండి వంట అన్ని రకాలుగా చేయించి తన చేతులతోనే వడ్డించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కే ఎన్ రాములు, మల్లేష్ ముదిరాజ్, గడ్డం శ్రీనివాస్, శ్రీకాంత్ యాదవ్,శ్రీశైలం యాదవ్,గంగాధర్ గౌడ్,ప్రభాకర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, నవీన్ గౌడ్, మున్నా, సాయి నందన్ ముదిరాజ్,పవన్,స్వామినాథ్,శంకర్,రమేష్,మూర్గేష్,రఘు, కుమార్, శ్రీకాంత్, శ్రీను, సాయి, పునీత, ఏశ్వంత్, పవన్, హర్ష, సాయి కిరణ్, దివ్య, పద్మ, జ్యోతి,భాగ్య, లలిత గోపి నగర్ వాసులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు

# ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలి.

ఎమ్మెల్యే తెల్లంను ,మాజీ ఎంపీ సోయం బాబురావు పై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాము

గొండ్వాన సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్



వాజేడు ప్రతినిధి (భారతి రిపోర్టర్ )వెంకటాపురం మండల కేంద్రంలో గురువారం జరిగిన గొండ్వాన సంక్షేమ పరిషత అత్యవసర సమావేశంలో, జి ఎస్ పి ములుగు జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్ పాల్గొని మాట్లాడుతూ..1950 ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నందు సుగాలిలు ప్రకాశం గుంటూరు జిల్లాలో మాత్రమే ఉండేవారనీ లంబాడి వర్గానికి చెందిన ఎవరు లేరని,1956 ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో సుగాలీలు .తెలంగాణ ప్రాంతంలో లంబాడీలు డీనోట్ పై ట్రైబల్స్ గా మాత్రమే ఉన్నట్లు పేర్కొన్నారు,1976 భారత పార్లమెంట్ అమెండ్మెంట్ యాక్ట్108అనుసరించి,భారతదేశ వ్యాప్తంగా పార్లమెంట్, లోక్ సభ ఎస్సీ ఎస్టీ సీట్లను పెంచుట కొరకు చర్చ జరిగిందనీ అన్నారు.ఆనాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నందు లంబాడాలకు ఎస్టి హోదా కల్పించే క్రమంలో నోటిఫికేషన్, ప్రజా అభిప్రాయ సేకరణ కూడా పాటించలేదని అన్నారు,లోక్ సభ మరియు రాజ్యసభ నందు చేర్చాలేదు కమిషన్ రిపోర్టు కూడా లేదనీ. కానీ అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జివో 149 ద్వారా కలిపినట్లు చూపిస్తుంది. ఇది ఎలా సాధ్యం? అని ప్రశ్నించారు. 1976లోనే బంజారా లంబాడీలను సుగాలి లను కలిపినట్లయితే 2003 లో సుగాలి ,బంజారా, లంబాడాలను ఎలా కలిపారని సూటిగా ప్రశ్నించారు?కానీ ఆర్టికల్ 342 ప్రకారంగా లీగల్ ప్రొసెసింగ్ జరగలేదు.1971లో ఆదివాసి జనాభా చూస్తే 2,85,226 ఉండేవారని, లంబాడాలు 1,32,464 ఉన్నారని తెలిపారు. 2021 నాటికి ఆదివాసులు 9 లక్షలు పైన ఉంటే లంబాడాలు 40 లక్షలు ఉన్నారు.దీనిని బట్టి ఎస్టీ రిజర్వేషన్ కోసం ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఓసి,బిసి లంబాడాలందరూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లోకి చొరబడి వచ్చినారని స్పష్టంగా తెలుస్తుందనీ రాజ్యాంగబద్ధంగా అన్ని డాక్యుమెంట్లను తీసుకొని, ఎస్టీ జాబితాలోకి పార్లమెంట్ ద్వారా రాలేదని సుప్రీంకోర్టులో కేసు వేశారని అన్నారు ఈ సమావేశంలో ఆదివాసులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన సమావేశం..

**ఇంటెలిజెన్స్ రిపోర్ట్ ప్రకారం రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ విజయం..!**

**మాజీ మార్కెట్ చైర్మన్ బోదేబోయిన బుచ్చయ్య**



వాజేడుప్రతినిధి (భారత్ రిపోర్టర్): మండలంలోని ధర్మవరం గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంకు ముఖ్య అతిథిగా మాజీ మార్కెట్ చైర్మన్ బోదేబోయిన బుచ్చయ్య హాజరై ఏజెన్సీలోని సర్పంచ్, ఎంపీపీ రిజర్వేషన్లు ఎస్.టి లకే ఉంటాయని మాట్లాడుతూ..రాబోయే ఎన్నికలలో వాజేడు మండలంలోని 17 గ్రామపంచాయతీలు ముందంజలో ఉన్నామని ఇంటెలిజెంట్ రిపోర్టు ద్వారా వచ్చిందని చెప్పారు ఎన్నికల్లో సర్పంచ్ లను,ఎంపీటీసీలను బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి గ్రామానికి అధ్యక్షులుగా సర్పంచ్ మండలనికి అధ్యక్షులుగా ఎంపీపీలను ఉంచాలని మన పనులు చక చక జరిగిపోతాయని ఇతర పార్టీ వాళ్లు కూడా మన పార్టీ వాళ్లకు ఓట్లు వేయడానికి సిద్ధమైనట్టు ఇంటెలిజెన్స్ రిపోర్ట్స్ లో తాజా సమాచార వచ్చినట్లు తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండా కాలయాపన చేయడంతో ప్రజలు కాంగ్రెస్ పార్టీని చిన్నచూపు చూస్తూ బుద్ధి చెప్పాలని ఆ వర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మన పార్టీ వాళ్లకి సమాచారం అందిస్తున్నారని తెలిపారు మీరందరూ ఆత్మీయంగా ఆత్మీయ



సమ్మేళనంగా కలిసికట్టుగా పనిచేస్తే ఎన్నికలలో సర్పంచ్ లు, ఎంపీటీసీలు, జెడ్పిటిసిలు,గెలిస్తే గ్రామం నుండి మన జిల్లా దాకా బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉంటుందన్నారు ఇప్పటికి ఇతర పార్టీల కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీ నిలబెట్టిన అభ్యర్థులకే ఓటు చేసి గెలిపించాలని ఆలోచనలో ఉన్నట్లు బిఆర్ఎస్ పార్టీ నాయకులకు ఇతర పార్టీ కార్యకర్తలు సమాచారం అందిస్తున్నట్లు తెలిపారు, ఈ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి చంద్రుపట్ల,కృష్ణాపురం, పేరూరు, టేకులగూడెం, ధర్మవరం, కోరకల్లు, చింతూరు, చెరుకూరు, పెద్ద గొల్లగూడెం బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు హాజరయ్యారు

# రాష్ట్రకమిటి పిలుపు మెరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కరోజు రేషన్ షాపులు బందు జిల్లా అధ్యక్షుడు బచ్చురాము



వనపర్తి జిల్లా ప్రతినిధి భారత్ రిపోర్టర్ సెప్టెంబరు 4 గురువారం :తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ డీలర్లకు గత 5 నెలలుగా కమీషన్లు ఇవ్వడంలేదు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలలో భాగంగా రేషన్ డీలర్లకు గౌరవ వేతనం రూ.5000 క్వింటాలుకు రూ.300 కమీషన్ ఇస్తామని హామి ఇచ్చారు కాంగ్రేసు ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలైన ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రేసు ప్రభుత్వం విఫలమైందన్నారు రేషన్ డీలర్లం ఇదే వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాము చాలీ చాలని కమీషన్లతో మా కుటుంబాలను పోషించలేని స్థితిలో వుండి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము రోజు రోజుకు మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నవి కానీ రేషన్ డీలర్ల కు కమీషన్ మాత్రం ప్రస్తుత ధరలకు అనుగుణంగా పెంచడంలేదుప్రతినెల రేషన్ డీలర్లు షాపు కిరాయి కరెంటుబిల్లు హమాలీ చార్జీలు హెల్పర్ వేతనం చెల్లించడంతో డీలరుకు ఏమి మిగలడంలేదు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో రేషన్ షాపులకు కేవలం ఒక్క బియ్యం మాత్రమే సరఫర చేస్తుండడంతో అరకొర కమీషన్ వస్తుంది ఆలా వచ్చేకమీషన్ తో మేము ఆర్థికంగా చాలా నష్టపోతున్నాము ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం కనీస గౌరవ వేతనం కింద రూ.5000 క్వింటాలుకు రూ.300 కమీషన్ ఇస్తూ 9 రకాల నిత్యావసర వస్తువుల సరఫరా చేయాలన్నారురేషన్ డీలర్ అకాల మరణం చేందితే రూ.30,000దహన సంస్కారాల నిమిత్తం తక్షణ సహాయంగా అందించాలి ఇన్సూరెన్స్ కింద10 లక్షల రూపాయలు అందించి డీలర్ల కుటుంబాలను ఆదుకోవాలి కోరారు రేషన్ షాపులకు వచ్చే సరుకును దింపే హమాలీ చార్జీలను ప్రభుత్వమే భరించాలికరోనా(కోవిడ్ 19) సమయంలో మరణించిన రేషన్ డీలర్లకు ప్రభుత్వం వెంటనే రూ,10 లక్షల ఎక్స్గ్రేషియా చెల్లించి ఆదుకోవాలన్నారుగొడౌన్ నుండి రేషన్ షాపులకు సరఫర చేసే బియ్యం బస్తాలు తూకం తక్కువగా వస్తే వాటిని వాపసు తీసుకోవాలని అలాగే రేషన్ షాపులకు 9రకాల నిత్యావసర వస్తువుల సరపరచేయాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని రేషన్ డిలర్లుకు రేపు సెప్టెంబరు 5 శుక్రవారం ఒక్కరోజు బందు చేయాలని పిలుపునిస్తూ నేడొక ప్రకటన లొ పేర్కొన్నారు




# గురువులకు వందనం... భావి భారత రూపశిల్పులు తెలుగు ఉపన్యాసకులు బిజ్వార్ మహేష్ గౌడ్



మక్తల్ భారత్ రిపోర్టర్ నియోజకవర్గ ప్రతినిధి విద్యార్థుల భవితకు మార్గదర్శకులు.నేడు ఉపాధ్యాయ దినోత్సవం.డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి. బిజ్వార్ మహేష్ గౌడ్ తెలుగుఉపన్యాసకులు,సామాజిక కార్యకర్త.మాతృదేవోభవ, పితృదేవోభవ,ఆచార్యదేవోభవ అని తల్లి తండ్రి తర్వాత స్థానం గురువుదేనని నేటి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తెలుగు ఉపన్యాసకులు,సామాజిక కార్యకర్త బిజ్వార్ మహేష్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారగురువు అనే పదానికి ప్రత్యేకమైన అర్థముందని 'గు' అంటే చీకటి 'రు'అంటే తొలగించు అని అర్థమని అజ్ఞానం అనే చీకటిని తొలగిస్తారు కాబట్టి గురువు అనే పేరు స్థిరపడిపోయిందని 'గు'అంటే గుహనమైనది,తెలియనిది.'రు'అంటే దానిని రుద్యము చేసేది.అంటే ఆ రహస్యమైనదానినితెలియపరిచేది.ఒక్క సిరాచుక్క లక్ష మెదళ్లకు కదలిక అన్నారు కాళోజి.జన్మనిచ్చేది తల్లిదండ్రులైతే ఆజన్మకు సార్ధకతను ఇచ్చేది గురువులు విద్యార్థులు తమకంటే మెరుగైన ప్రయోజకులు కావాలని నిస్వార్థంగా ఆలోచించేది గురువు మాత్రమే వారు విద్యార్థుల భవిష్యత్తు గురించి నిరంతరం పరితపిస్తారన్నారు.గురుపూజోత్సవం అనగానే సర్వేపల్లి రాధాకృష్ణన్ రూపంసాక్షాత్కరిస్తుందనిదేశమంతటా ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలన్నీ పండుగగా నిర్వహించుకునే సుదినం ఈ రోజుఅనిడాక్టర్ సర్వేపల్లిరాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామనిపేర్కొన్నారు.ఉపాధ్యాయుడ సృష్టి స్థితి లయల నిర్దేశకుడని, గురు బ్రహ్మ,గురు విష్ణు,గురు దేవో మహేశ్వర గురు సాక్షాత్ పరబ్రహ్మశ్రీగురువేనమః..మనిషి పుట్టినప్పటినుంచి మరణించేదాకా ప్రతి అడుగులోను,ప్రతిక్షణంలోను అతను ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్చుకుంటూనే ఉంటాడని అతను నేర్చుకునే ప్రతి అంశం వెనుక గుర్తుగా ఒక గురువు దాక్కునే ఉంటాడనీ ఆ గురువును మనమందరం ప్రత్యక్షంగా చూడగలిగేది తరగతి గదిలో విద్యనుఅభ్యసించినప్పుడేనన్నారు.ప్రతి విద్యార్థి గురువును దైవంగా భావిస్తూ తన భవిష్యత్తును ఆయన అనుభవాన్ని వారధిగా చేసుకుని ముందుకుసాగాలన్నారు.పుస్తకంలోని పాఠాలే కాదు జీవితంలో నిర్వాసిక పాఠాలు,గుణపాఠాలు తెలుసుకోవడం గురువుకే సాధ్యమవుతుందని గురువు దేవుడు ఎదురైతే నేను ముందుగా గురువుకే వందనం చేస్తానంటాడు ప్రఖ్యాత కవి కబీర్ గురువు గొప్పదనం అలాంటిది గురువు లేని విద్య గుడ్డిది అని భావించి ఏకలవ్యుడు ద్రోణాచార్యుడి ప్రతిమను ఎదురుగా ఉంచి విలు విద్య సాధన చేశాడన్నారు.ఒక వైద్యుడు,ఒక ఇంజనీర్,ఒక న్యాయవాది నిర్లక్ష్యం వహిస్తే కొంత నష్టమే వాటిల్లుతుంది కానీ ఉపాధ్యాయుడు అలా చేస్తే ఒక తరం నష్టపోతుందని కాబట్టి గురువులెప్పుడు పిల్లలకు ఆదర్శంగా నిలవాలని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ లామేధోపరమైన,సంస్కృతి పరమైన,శాస్త్ర సంబంధమైన వారసత్వాన్ని ఒక తరం నుంచి మరో తరానికి అందించే వాటిని విద్యాలయాలుగా భావించాలనేది రాధాకృష్ణన్ భావన అని తెలిపారు. విద్యాలయాలు బండి అయితే వాటిని నడిపించే ఇరుసులు గురువులు అని ఒక తరాన్ని ముందుకు నడిపించాలన్న, ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్న కేవలం అదిగురువులకేసాధ్యమవుతుందన్నారు. కంప్యూటర్లు,మొబైల్స్, ఎల్సీడీలు,ప్రొజెక్టర్లు ఇలా ఎన్ని సాంకేతిక పరికరాలు ఉన్న గురువుల ప్రభావం తగ్గలేదంటే అది గురువుల గొప్పదనమని గురువుల దిశా నిర్దేశం తప్పకుండా అవసరమే అని ప్రస్తుత విద్యా విధానంలో కూడా మార్పులు వస్తున్నాయనిఆమార్పులకనుగుణంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించాలని మహేష్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

# సెయింట్ యూజెన్ లో ఘనంగా గురుపూజోత్సవం



పోలవరం, సెప్టెంబర్ 4(భారత్ రిపోర్టర్)సెయింట్ యూజెన్ ఇంగ్లీషు మీడియం స్కూల్ నందు గురువారం గురుపూజోత్సవం మరియు ఓనం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.భారతదేశ రెండవ రాష్ట్రపతి, గొప్ప విద్యా వేత్త మరియు భారతదేశపు మొట్ట మొదటి ఉప రాష్ట్రపతి అయిన డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జ్ఞాపకాలను స్మరించారు.ఆయన విద్యా, సేవలు, గురువుల పట్ల ఆయన చూపిన గౌరవం గురించి ఉపాధ్యాయులు ప్రసంగించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నృత్యాలు, పాటలతో అందరిని ఆకట్టుకున్నారు. ఓనం పూల అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో డ్రోన్ సహాయంతో పాఠశాల ప్రాంగణాన్ని చిత్రకరించడం విశేషం. పాఠశాల కరస్పాండెట్ ఫా. కిషోర్, ప్రిన్సిపల్ ఫా.జాన్ (బిట్టో), వైస్ ప్రిన్సిపల్ ఫా. ఆరోన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# శ్రీశైలం 98జీఓ నిర్వాసితుల ఆవేదనపై స్పందించిన రాష్ట్ర మంత్రి జూపల్లి

కట్టుబట్టలతో ఇల్లు భూములు వదిలి వచ్చాం మాకు ఉద్యోగాలు ఇవ్వండి



చిన్నంబావి మండలం భారత్ రిపోర్టర్:శ్రీశైలం నిర్వాసితులు అత్యవసర సమావేశం చిన్నంబావి మండల కేంద్రంలో రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావును కలిసి అనంతరం, శ్రీశైలం 98 జీఓ నిర్వాసితులు చిన్నంబావి మండలంలో అత్యవసర సమావేశమై, ఇకపై ఎలా ముందుకు వెళ్లాలన్న విషయంపై సుదీర్ఘంగా చర్చించారు.నిర్వాసితులు కే.డాగుజీ రావు మాట్లాడుతూ.... 40 ఏళ్ల సుదీర్ఘ పోరాటం చేశాను సార్ కాలయాపన చేయకుండా మాకు ఉద్యోగాలు ఇచ్చే విధంగా చూడండి అంటూ సర్వసం కోల్పోయాం శ్రీశైలం 98 జీఓ నిర్వాసితులు ఈరోజు కొల్లాపూర్ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావును కలిశారు. ఈ సందర్భంగా నిర్వాసితుడు రంగస్వామి కన్నీటి గాథ,తో రెండు చేతులు జోడించి ఆవేదన వ్యక్తం చేస్తూ %-%"సార్%ా% మా ఉద్యోగాలు మీరు అనుకుంటే వారం రోజుల్లో ఇప్పించగలుగుతారు. ఇల్లు, భూములు, ఆస్తులు అన్నీ వదులుకుని నిర్వాసితులమయ్యాం. కట్టుబట్టలతో వచ్చాం. కూడు గుడ్డ లేక పల్లెలు వదిలి పట్టణాల్లో మట్టి పనులు చేస్తూ మా కుటుంబాన్ని పోషించుకుంటు బతుకుతున్నాం. కాలయాపన చేయకుండా మాకు ఉద్యోగాలు ఇచ్చి మా కుటుంబాలను ఆదుకోండి సార్"అని విజ్ఞప్తి చేశారు.నిర్వాసితుల సమస్యలపై మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందిస్తూ"ముగ్గురు కలెక్టర్లకు ఇప్పటికే చెప్పాను. త్వరలో కమిటీ కూర్చుంటుంది. వారు రిపోర్ట్ ఇస్తారు. ఆ రిపోర్ట్ ప్రకారం పూర్తి క్లియరెన్స్ చేస్తాం"అని భరోసా ఇచ్చారు.మంత్రిని కలిసిన వారిలో కే. డాగోజీ రావు గోవింద్, సుధాకర్, రంగస్వామి, కొత్తకోట కృష్ణకురుమూర్తి, గూడెం విష్ణు పెద్దమారు నిర్వాసితులు గౌరవ ఉపాధ్యక్షులు కాలూరు పెప్పేటి నారాయణరెడ్డి బెక్కెం కాంతయ్య, హోటల్ హుస్సేన్, నాయుడు ఎస్ శ్రీనివాసులు, వెంకటస్వామి, ఉత్తరయ్య గౌడ్, మహబూబ్ మియా, వెల్లటూరు ఆనంద్, కొప్పునూరు నటరాజ్, వడ్డేమాన్ విష్ణువర్మ, కురుమయ్య, జటప్రోలు రవీందర్ శెట్టి, షబ్బీర్ అలీ, మహబూబ్ మియా, మంచాలకట్ట బాలయ్య శ్రీనివాసులు గూడెం కృష్ణయ్య రాఘవేంద్ర శెట్టి తదితరులు పాల్గొన్నారు

# సివిల్ సప్లై నిబంధనల ప్రకారం రైస్ మిల్లు ఏర్పాటు చేయాలి అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్



వనపర్తి జిల్లా ప్రతినిధి భారత్ రిపోర్టర్ సెప్టెంబరు 4 గురువారం:ఘణపురం మండలంలో ఎస్వీఎస్ ఇండస్ట్రీస్ కొత్త రైస్ మిల్లును ఏర్పాటు చేసేందుకు దరఖాస్తు చేసుకోగా గురువారం అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్ మిల్లుకు సంబంధించిన అనుమతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు నిబంధనల ప్రకారం మిల్లును ఏర్పాటు చేయాలని యజమానికి తెలిపారు రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు అనంతరం వనపర్తి మండలంలో ఉన్న ఆంజనేయ ట్రేడర్స్ ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు రైస్ మిల్ లో ఉన్న నిల్వ దాన్యాన్ని పరిశీలించారు ధాన్యంలో కొనుగోలు నిలువలకు సంబంధించిన అధికరణం క్షుణంగా పరిశీలించి ధ్యానం విలువల లభ్యత గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మిల్లర్లతో మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో కూడా రైతులను కొనుగోలు విషయంలో మోసగించద్దని అన్నారుజిల్లాలో ఉన్న మిల్లుల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ ఉంటుందని అన్నారు రెవెన్యూ కలెక్టర్ ఖీమ్యా నాయక్ వెంట సివిల్ సప్లై అధికారి కాశి విశ్వనాథం సిబ్బంది ఉన్నారు



# గంజాయి రవాణా చేస్తు పట్టుబడ్డ యువకుడు అరెస్ట్



ములుగు :ప్రతినిధి (భారత్ రిపోర్టర్) ములుగు జిల్లా కేంద్రంలోని డిఎల్ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద గంజాయి రవాణా చేస్తున్నాడు అనే సమాచారం తో డీ ఎల్ ఆర్.ఫంక్షన్ హాల్ వద్ద వాహన తనిఖీ చేయగా నెంబర్ ప్లేట్ లేని ఆర్ 1.5 మోటార్ సైకిల్ పై ఒక వ్యక్తి అనుమాన స్పదంగా కనిపించగా ఆతనని ఆపి అతని ద్విచక్ర వాహనం మీద ఉన్న సంచి ని తనిఖీ చేయగా అతని వద్ద ఎండు గంజాయి 360 గ్రాములు లభ్యం కాగా వెంటనే అతని అలుపులోకి తీసుకొని పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి అతని వివరాలు సేకరించగా అతని పేరు లద్దునూరి పవన్. తండ్రి సారయ్య కులం.మాదిగ వృతి:మెకానిక్ గ్రామం ఇంచెర్ల ములుగు మండలం అని తెలిసింది, ఇతను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము సీలేరు నుండి గంజాయి తెచ్చి ఇంచెర్ల లోని అతని ఇంట్లో దాచి పెట్టి అట్టి గంజాయి ని ములుగు, వెంకటాపూర్ మరియు పరిసర ప్రాంతాలలోని గంజాయి త్రాగే అలవాటు ఉన్న యువతకు అమ్ముతుంటానని ఈ రోజు ములుగు లో అమ్ముటకు వస్తున్నానని తెలపగాగంజాయి తో పట్టు బడిన వ్యక్తిని సి ఆర్ నెంబర్. 382/2025 లో.ఎన్ డి పి ఎస్. చట్టం ద్వారా ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసి అతని వద్ద నుంచి మోటార్ సైకిల్, 360 గ్రాముల గాంజాయి మరియు మొబైల్ సీజ్ చేసి,రిమాండ్ కు తరలించారు. ఈ వాహన తనిఖీలాలో ములుగు ఎస్సైలు సిహెచ్ వెంకటేశ్వరా రావు సిహెచ్ రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజా ప్రభుత్వంలో అందరికీ రేషన్ కార్డులు

\- కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాక్సుధ్



జహీరాబాద్ టౌన్ మొగుడంపల్లి మండలం సెప్టెంబర్ 04 (భారత రిపోర్టర్)అర్హులైన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను మంజూరు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు మహమ్మద్ మాక్సుధ్ హైమద్ అన్నారు.గురువారం మండల మొగుడంపల్లి కేంద్రంలోని రైతు వేదికలో నూతన రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ...ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ సర్కార్ లక్ష్యమన్నారు.అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లు అనేక పథకాలు అందజేశారన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ జుబేర్,ఎంపీడీవో మహేష్,ఆర్ఐ సిద్ధారెడ్డి,పంచాయతీ కార్యదర్శి మారుతి,కాంగ్రెస్ నాయకులు ప్రేమ్ కుమార్,వెంకట్ రామ్ రెడ్డి,ఇందిరమ్మ కమిటీ సభ్యులు,యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

Postal Licenced No: HDP/010/2024-2026
భారత్
RNI.APTEL/2023/88573
తెలుగు దినపత్రిక
BHARATH REPORTER రిపోర్టర్


## ప్రజా ప్రభుత్వంలో అందరికీ రేషన్ కార్డులు

### - కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాక్సుద్




జహీరాబాద్ టౌన్ మొగుడంపల్లి మండలం సెప్టెంబర్ 04 (భారత రిపోర్టర్)అర్హులైన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను మంజూరు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు మహమ్మద్ మాక్సుద్ హైమద్ అన్నారు.గురువారం మండల మొగుడంపల్లి కేంద్రంలోని రైతు వేదికలో నూతన రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ...ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ సర్కార్ లక్ష్యమన్నారు.అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లు అనేక పథకాలు అందజేశారన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ జుబేర్,ఎంపీడీవో మహేష్,ఆర్ఐ సిద్ధారెడ్డి,పంచాయతీ కార్యదర్శి మారుతి,కాంగ్రెస్ నాయకులు ప్రేమ్ కుమార్,వెంకట్ రామ్ రెడ్డి,ఇందిరమ్మ కమిటీ సభ్యులు,యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ములుగు జిల్లా కేంద్రంలో మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట సిబ్బంది ధర్నా.




ములుగు: ప్రతినిధి (భారత్ రిపోర్టర్)ములుగు జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ లో దారుణం జరిగిందిఆరు నెలల జీతాలు రాక మనస్థాపనతో పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డ మైదం మహేష్.సిబ్బంది కి ఆబ్సెంట్లు ఉన్నాయంటూ ప్రతి సిబ్బంది నుండి 2 వేలు కట్ చేస్తూ ఈవోగా పనిచేస్తున్న రఘు, బిల్ కలెక్టర్ కిరీట్ లు సిబ్బంది నుండి డబ్బులు వసూలు చేస్తున్నారంటూ ఆరోపణలు.ఈవో రఘు, బిల్ కలెక్టర్ కిరీటి మహేష్ ను మనస్థాపానికి గురి చేశారంటూ ఆరోపణలు చేస్తూ ధర్నా చేశారుమృతడి కుటుంబానికి 50 లక్షల ఎక్స్గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు.మహేష్ మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని చేస్తూములుగు జిల్లా మున్సిపాలిటీ కార్యాలయం ముందు కార్మికులు ధర్నా చేపట్టారు. అధికారులు జీతాలు ఇవ్వక ఆర్థిక ఇబ్బందులు భరించలేక కుటుంబాన్ని పోషించలేక ఆత్మహత్య చేసుకున్న .మాధరావు పల్లికి చెందిన మహేష్ గత ఎనిమిది సంవత్సరాల నుండి ములుగు గ్రామపంచాయతీలో పనిచేస్తున్నాడు.ములుగు గ్రామపంచాయతీ గా ఉన్నప్పుడు ఏప్రిల్, మే రెండు నెలల నెల జీతం రాక మున్సిపాలిటీలో ఉన్న బిల్ కలెక్టర్ కిరీటి ఈవో రఘు తన జీతం ఇవ్వ కుండ మనస్థాపానికి గురి చేయడంతో బలహ మరణానికి పాల్పడ్డాడంటూ కుటుంబ సభ్యులతో మున్సిపాలిటీ ముందు సిబ్బంది ధర్నా చేపట్టారు. మహేష్ కుటుంబానికి 50 లక్షల ఎక్స్గ్రేషియా చెల్లిస్తూ ఇంట్లో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని సిపిఎం బిఆర్ఎస్ బిజెపి, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



జహీరాబాద్/ఝరాసంగం: సెప్టెంబర్ 4( భారత్ రిపోర్టర్)ఝరాసంఘం మండలంలోని అక్షర భారతి మోడల్ స్కూల్ లో ముందస్తుగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస్, మాట్లాడుతూ భారత దేశంలో సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా టీచర్స్ డే జరుపుకుంటారు మరియు అలాగే భారతదేశంలో మొదటి ఉపరాష్ట్రపతిగా దేశానికి మరియు ఉపాధ్యాయుడుగా సమాజానికి ఎన్నో సేవలందించారు అని తెలిపారు.మరియు ఉపాధ్యాయులకు స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు సన్మానించడం జరిగింది కార్యక్రమంలో ప్రవీణ్, వెంకట్, మహాదేవి, సనా ఫాతిమా ధనలక్ష్మి శోభ ముస్కాన్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## ఎఫ్ డి ఆర్ నిధులను నిర్ణీత కాలంలో ఖర్చు చేయాలి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి




వనపర్తి జిల్లా ప్రతినిధి భారత్ రిపోర్టర్ సెప్టెంబరు 4 గురువారంగత ఏడాది 24-25 ఆర్థిక సంవత్సరంలో వనపర్తి జిల్లాలో భారీ వర్షాలు వరదల వల్ల జరిగిన నష్టాలకు కేంద్ర విపత్తు నిర్వహణ ద్వారా మంజూరు అయిన 3.00 కోట్ల నిధులను ఖర్చు చేసి యు.సి లు సిద్ధం చేసి పంపించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు గత వర్షం వరదల వల్ల ఎక్కడెక్కడ నష్టం వాటిల్లిందొ వాటికి మరమ్మతుల కొరకు ఖర్చు చేసిన బిల్లులు సిద్ధం చేయాలన్నారుగురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో విద్యాశాఖ రోడ్డు భవనాలు సంక్షేమ శాఖ వైద్య ఆరోగ్యశాఖ నీటిపారుదల మున్సిపాలిటీ శాఖలకు సంబంధించిన నష్టాలు చేపట్టిన మరమ్మతు పనులను కలెక్టర్ సమీక్షించారు ఎడతెరపి లేని వర్షాల వల్ల డ్యామేజ్ అయిన అంగన్వాడి భవనాలు రోడ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మహిళా సంఘ భవనాలు మిషన్ భగీరథ ట్యాంకులు తదితర మరమ్మతుల కోసం కేంద్ర విపత్తుల నిర్వహణ శాఖ ద్వారా రూ.3 కోట్ల నిధులను కేటాయించడం జరిగిందని వాటిని సకాలంలో సద్వినియోగం చేసుకొని యుటిలైజేషన్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుందన్నారు పనులు ఎంత మేరకు పూర్తయ్యాయి ఎన్ని పనులు పురోగతిలో ఉన్నాయని



అధికారులను అడిగి తెలుసుకున్నారు ఈ నెలాఖరి వరకు పనులను సంపూర్ణంగా పూర్తి చేయాలని ఆదేశించారు అలాగే ఇటీవల కురిసిన వర్షాలకు ఎక్కడెక్కడ ఎంత నష్టం జరిగిందో నివేదిక ఇవ్వాలని వాటికి సంబంధించిన మరమ్మతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలన్నారుఈ సమీక్ష సమావేశంలో విద్యాశాఖ అధికారి మహమ్మద్ గని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసులు మున్సిపాలిటీ కమిషనర్లు ఆర్ అండ్ బి అధికారులు ఇరిగేషన్ శాఖ అధికారులు డి.సెక్షన్ సూపరింటెండెంట్ మదన్మోహన్ తదితరులు పాల్గొన్నారు

## బిజెపి బిఆర్ఎస్ పార్టీలు శవ రాజకీయం చేయడం సిగ్గుచేటు అని ఖండించిన కాంగ్రెస్ నాయకులు.




ములుగు :ప్రతినిధి (భారత్ రిపోర్టర్) ములుగు మున్సిపాలిటీ లో పనిచేస్తున్న మైదం మహేష్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న మాట్లాడుతూమహేష్ మృతికి కారకులైన వారిని ఎంతటి వారైనా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అంటూ.బిఆర్ఎస్ పార్టీ నాయకులు శవ రాజకీయాలు చేయడం సిగ్గు చేటు అని అంటూములుగు మున్సిపాలిటీ లో పని చేస్తున్న శానిటేషన్ వర్కర్ మైదాం మహేష్ స్వయంగా తను మంచి నీళ్లు అనుకొని తగిన అని స్వయంగా ఆయనే చెప్పడం జరిగిందని కావాలనే బిజెపి బిఆర్ఎస్ నాయకులు రాదంతం చేస్తుబిఆర్ఎస్ పార్టీ నాయకులు రాజకీయ లబ్ధి కోసం శవరాజకీయం చేస్తూ రోడ్లపై భైఠాయిస్తున్నారునిన్న రాత్రి ములుగు మున్సిపాలిటీ లో శానిటేషన్ వర్కర్ గా పనిచేస్తున్న మైదం మహేష్ మృతి చెందగా వారి మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిటమట రఘు మరియు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న మైదం మహేష్ మృతిని తమ స్వార్థ రాజకీయాల కోసం వాడుకొని బీజేపీ బిఆర్ ఎస్ పార్టీ నాయకులు రాజకీయాలు చేయడం సరికాదన్నారు మృతుడు మహేష్ తను విధులు ముగించుకుని ఇంటికి వెళ్లిన తర్వాత మంచినీళ్లు అనుకొని పురుగుల మందు తాగిన అని స్వయంగా మహేష్ చెప్పడం జరిగింది అని దీనికి గల కారణాలు తెలుసుకొని మృతికి కారకులైన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మృతుని కుటుంబానికి న్యాయం చేస్తామని అధికారులకు మంత్రి సీతక్క చెప్పారని అన్నారు.

## బదిలీ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



యలమంచిలి సెప్టెంబర్ 04 (భారత్ రిపోర్టర్ )యలమంచిలి మండలం జంపపాలెం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తూ ఉత్తమ సేవలందించి ఇటీవలే వివిధ పాఠశాలలకు బదిలీ ఉపాధ్యాయులకు గ్రామంలో గల పూర్వ విద్యార్థులు, స్టార్ బాయ్స్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బదిలీ సర్వ సాధారణమని, అయినప్పటికీ గ్రామంలో తమ పాఠశాలకి వారు వచ్చినప్పటి నుంచి ఉత్తమ సేవలందించినందుకు వారిని బాధ్యత గల గ్రామ పౌరులుగా సన్మానించడం ప్రాథమిక బాధ్యతన్నారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, స్టార్ బాయ్స్ యూత్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా బిజెపి మండల అధ్యక్షులు శరత్ చంద్రారెడ్డి జన్మదిన వేడుకలు




చిట్టమూరు (సెప్టెంబర్ 4 భారత్ రిపోర్టర్) మండల పరిధిలోని కొత్తగుంట కూడలి నందు వున్న భారతీయ జనతా పార్టీ స్థూపం నందు బీజేపీ మండల అధ్యక్షులు దువ్వూరు శరత్ చంద్రా రెడ్డి జన్మదిన వేడుకలను మండల బిజెపి పార్టీ శ్రేణులు గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శరత్ రెడ్డితో కేక్ కట్ చేయించి,బీ జేపీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ,మన బీజేపీ మండల అధ్యక్షులు దువ్వూరు శరత్ చంద్రా రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు,సుఖ సంతోషాలతో ఉండి ఇటువంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని,మన బీజేపీ పార్టీని ముందుకు నడిపించాలని కోరుకుంటున్నామని తెలియజేశారు.

## టిఎంఆర్ లో ఘనంగా ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



చిట్టమూరు (సెప్టెంబర్ 4 భారత రిపోర్టర్).టిఎంఆర్ ప్రైవేటు పాఠశాలలో ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు.యాటా ఉత్తమ ఉపాధ్యాయులను గౌరవించుకునే ఆనవాయితీని కొనసాగిస్తూ ఉపాధ్యాయ వృత్తిలో విశేష సేవలు అందిచిన ఉపాధ్యాయులను సన్మానించారు.టిఎంఆర్ పాఠశాల ఉపాధ్యాయులను మనోహర్ రెడ్డి పూలమాలు, శాలువాలతో సన్మానించి,సత్కరించారు. విద్యార్థులు ఆలపించిన గీతాలు,సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ రహంతుల్లా,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వాజేడు నాగారం ఉన్నత పాఠశాలలో భారత మాజీ రాష్ట్రపతి డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినోత్సవం



వాజేడు ప్రతినిధి (భారత్ రిపోర్టర్) నాగారంలో ఉన్నంత పాఠశాలలో మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ (సెప్టెంబర్ 5) జన్మదినోత్సవం పురస్కరించుకొని ముందస్తుగా (సెప్టెంబర్ 4 గురువారం) రోజు ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోయం ఆనందరావు జ్యోతి ప్రజ్వలన చేసి, మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా రాధాకృష్ణన్ విద్యారంగానికి భారత జాతికి చేసిన సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు తమకు విద్యా బుద్ధులు నేర్పిస్తున్న ఉపాధ్యాయులను పూలమాలలతో, బొకేలతో దుశ్శాలువాలతో సన్మానించి భక్తి ప్రపత్తులను చాటారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పోరిక స్వరూప్ సింగ్,చల్లగురుగుల మల్లయ్య,వెంకట రమణ,రంగు ఆనంద్,నూనావత్ శ్రీకాంత్,కంచు ప్రభాకర్,తెల్లం రాజ్యలక్ష్మి,షిండే రాజేష్,కోకిల శ్రీరంగం,జర్పుల వస్య తదితరులు పాల్గొన్నారు

## ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బాపన్ పల్లి రవికుమార్ మాదిగ



సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం సెప్టెంబర్ 04 ( భారతి రిపోర్టర్) సంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కోహీర్ మండలం వెంకట్ పూర్ గ్రామానికి చెందిన బాపన్ పల్లి రవికుమార్ ను నియమిస్తూ ఈరోజు సంగారెడ్డి పట్టణంలో అంబేద్కర్ భవన్ లో జరిగిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జిల్లా ఇన్చార్జి వి ఎస్ రాజు మాదిగ జిల్లా అధ్యక్షులు బుచ్చేంద్ర మాదిగ రాష్ట్ర నాయకురాలు పెద్ద గీతా మాదిగ ఆధ్వర్యంలో బాధ్యతలు అప్పగిస్తూ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్ మాదిగ మాట్లాడుతూ నాపై నమ్మకం తో జిల్లా ఉపాధ్యక్షులు ఎన్నుకున్నందుకు గౌరవ పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ అన్నగారికి గారికీ మరియు జిల్లా ఇంచార్జి మరియు జిల్లా నాయకులకు కోహీర్ మండల ఎమ్మార్పీఎస్ నాయకులకు కార్యకర్తలకు అండగా ఉన్న ప్రతి ఒక్కరికి సీనియర్ నాయకులకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

## విద్యతోనే విద్యార్థులు ఏదైనా సాధించవచ్చుబాదం ప్రవీణ్.



ములుగు ప్రతినిధి (భారత్ రిపోర్టర్)ములుగు జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ ఎస్సీ హాస్టల్లో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన లైబ్రరీ నిర్వహణ కోసం జనని ఫౌండేషన్ అధినేత డాక్టర్ రాజా బుధవారం వివిధ రకాల పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ములుగు జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని దానాల్లో విద్యాదానం గొప్పదని, విద్యార్థులకు జ్ఞానాన్ని అందించే పుస్తకాలను అందించేందుకు జనని ఫౌండేషన్ అధినేత రాజా ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. విద్యార్థులు ఉన్నత చదువుకొని లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. ఉన్నత చదువులు చదువుకొని కన్న తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో

## వైద్య ఆరోగ్య శాఖలో జాతీయ కీటక జనత వ్యాధుల నివారణ ప్రోగ్రాము.




అనంతపురం పట్టణం. సెప్టెంబర్ 04 ( భారత్ న్యూస్ )అనంతపురం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మలేరియా విభాగం నందు అనంతపురం జిల్లా మలేరియా అధికారి డి ఓబులు గారి అధ్యక్షతన జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ ప్రోగ్రామ్ కింద అనంతపురం మరియు పుట్టపర్తి జిల్లాలలోని మలేరియా సబ్ యూనిట్ అధికారులకు సమీక్షా సమావేశం నిర్వహించ డం జరిగింది.మలేరియా సబ్ యూనిట్ అధికారులు ఉమ్మడి అనంతపురం జిల్లాలో సీజనల్ వ్యాధుల పైన గ్రామాలలో పర్యటించి వైద్య ఆరోగ్య సిబ్బంది ,గ్రామ సచివాలయ సిబ్బంది ,గ్రామపంచాయతీ ,మున్సిపాలిటీ అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు అవగాహన సమావేశాలు నిర్వహించాలని అలాగే ఉమ్మడి జిల్లా అంతట అన్ని గ్రామాలలో వైద్యా ఆరోగ్య శాఖసిబ్బంది ఫీవర్ సర్వే నిర్వహించాలని ఆయన ఆదేశించారు .అలాగే ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రగులుతున్నందున ఈ తరుణంలో దోమ కాటు వలన సంభవించే డెంగ్యూ ,మలేరియా ,చికెన్ గునియా తదితరవ్యాధులు ప్రబలకుండా వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న గ్రామాలలో హెల్త్ అసిస్టెంట్లు పర్యటించి సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు మరియు మండల పరిషత్ అధికారులకు ఈవోఆర్డి గ్రామం సచివాలయం సిబ్బందికి గ్రామపంచాయతీ అధికారులకు మరియు మున్సిపల్ శాఖ అధికారులకు గ్రామాలలో ఆరోగ్య సమస్యలు వ్యాధుల పరంగా వివరిస్తూ పారిశుద్ధ్య పర్యవేక్షణ విషయంలో నిర్లక్ష్యం వహించకుండా వారితో మమేకమై ముక్కుమ్మడిగా అధికారులందరూ సంఘటితంగా వ్యాధులు రాకుండా చూడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని ఉమ్మడి జిల్లా మలేరియా నివారణాధికారి ఓబులు సమావేశంలో సిబ్బందికి సూచించారు .ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాలలో పలుచోట్ల గతంలో వైద్య ఆరోగ్య సిబ్బందికి మరియు హెల్త్ అసిస్టెంట్లకు సీజనల్ వ్యాధుల పరిరక్షణ నిమిత్తమై శిక్షణ కార్యక్రమంలో భాగంగా మలేరియా డెంగ్యూ తదితర వ్యాధి నివారణ చర్యలు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలు గురించి శిక్షణ కార్యక్రమాలు వారికి నిర్వహించే వ్యాధి లక్షణాలు ముందు జాగ్రత్త చర్యలను గూర్చి తెలియజేయడం జరిగిందన్నారు రాష్ట్ర శాఖ వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు మరియు మున్సిపల్ శాఖ అధికారులు తెలియజేసిన పలు సూచనలు సలహాలను సమావేశంలో సిబ్బందికి ఉమ్మడి జిల్లా మలేరియా నివారణాధికారి తెలియజేశారు ,అలాగే ప్రతి గ్రామంలో ఫీవర్ సర్వే సిబ్బంది నిర్వహించేటప్పుడు ఐదు జ్వరం కేసుల కంటే ఎక్కువ ఉంటే సంబంధిత అధికారులు వెంటనే తమ దృష్టికి తెచ్చి గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీహెచ్వోలు గిరిధర్ రెడ్డి ,బత్తుల కోదండరామిరెడ్డి ,నాగేంద్ర ప్రసాద్ ,మునాఫ్ ,తిరుపాలయ్య ,మద్దయ్య ,ప్రభాకర్ ,శమీ ఉల్లా ,రామకృష్ణ ,శ్రీనివాసరావు ,జయరాం నాయక్ దేవలాల్ నాయక్ శివయ్య గోపి నాయక్ రామాంజనేయులు లక్ష్మీ నాయక్ హెల్త్ సూపర్వైజర్లు లోకేశ్వర్ రెడ్డి మధు శ్రీధర్ నూర్ భాషా మహబూబ్ బాషా ,రమేష్,శశిధర్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## ఝరాసంగంలో ఆత్మీయ వీడ్కోలు




ఝరాసంగం/సెప్టెంబర్ 4 (భారత రిపోర్టర్)సంగారెడ్డి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో, ఝరాసంగం మండలంలోని స్ఫూర్తి మండల సమాఖ్య తరపున గురువారం ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.ఈ సమావేశంలో టిక్యా నాయక్, సీసీలు మల్లేశం, గోపాల్, నరసమ్మ, యాదగిరి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.మండల సమాఖ్యకు కొత్తగా ఏపిఎంగా నియమితులైన భాగయ్యకు సభలో హృదయపూర్వక స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో తుక్కమ్మ, ఇస్తర్ రాణి, అమృత, మిట్టప్ప తదితర సీసీలు పాల్గొన్నారు.వివో సంఘం అధ్యక్షుడు హర్షితతో పాటు ఖాజా, సిరాజ్, సంధ్యారాణి, పద్మ, రాములు, మహమ్మద్, రాజ్ పటేల్, సూరెడ్డి తదితరులు ఈ సందర్భంగా హాజరయ్యారు.

Postal Licenced No: HDP/010/2024-2026
భారత్ రిపోర్టర్ BHARATH REPORTER తెలుగు దినపత్రిక RNI.APTEL/2023/88573
జనరల్ న్యూస్
శుక్రవారం - 05 - సెప్టెంబర్ - 2025

## వరద నష్టం నివేదికతో కేంద్ర సహాయం కోరిన
# తెలంగాణ మంత్రులు



**హైదరాబాద్, :** తాజా భారీ వర్షాలు, వరదలతో తెలంగాణ రాష్ట్రం అతలాకుతలం అయిన నేపథ్యంలో రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర పరిస్థితులను వివరించారు. మధ్యాహ్నం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌తో సమావేశమైన భట్టి విక్రమార్క, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, లోన్ రీస్ట్రక్చరింగ్ అంశాలపై చర్చించారు. అంతేకాదు, తెలంగాణలో విస్తారంగా పండించే పామాయిల్‌పై విధిస్తున్న సుంకాలను తగ్గించాలని కోరారు. రాష్ట్రంలోని విద్యాసంస్థలకు అవసరమైన ఆర్థిక సాయం అందించాలన్న విజ్ఞప్తులను కూడా నిర్మల సీతారామన్ దృష్టికి తీసుకువెళ్లారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ, "సాయంత్రం కేంద్ర హోం మంత్రి అమిత్ షాని కూడా కలవబోతున్నాం. రాష్ట్రంలో వరదల వల్ల జరిగిన భారీ నష్టాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లి, కేంద్రం నుంచి సహకారం కోరతాం" అని తెలిపారు. ఇక వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, తెలంగాణలో వందేళ్లలో ఎన్నడూ లేని విధంగా వర్షపాతం నమోదైందని, దాంతో రహదారులు, పంటలు, ఆస్తులకు విపరీత నష్టం జరిగిందని పేర్కొన్నారు. "మొన్న ముఖ్యమంత్రి ఏరియల్ సర్వే చేశారు. ఇవాళ ప్రత్యక్షంగా పర్యటిస్తున్నారు. ప్రాథమిక నివేదికను సాయంత్రం హోం మంత్రి అమిత్ షాకు అందజేస్తాం. త్వరలో పూర్తి నివేదికను కూడా సమర్పిస్తాం" అని తెలిపారు. అలాగే, గతంలోనూ వరదల సమయంలో కేంద్ర బృందాలు వచ్చి పర్యటించినప్పటికీ, ప్రత్యేకంగా ఎలాంటి వరద సాయం రాష్ట్రానికి అందలేదని విమర్శించారు. "బీజేపీ పాలిత రాష్ట్రాలకు కేంద్రం ప్రత్యేక గ్రాంట్లు ఇస్తోంది. అదే విధంగా తెలంగాణకు కూడా ప్రత్యేక గ్రాంట్ కేటాయించాలి. వరదల కారణంగా ఇప్పటివరకు జరిగిన నష్టం సుమారు రూ.5 వేల కోట్లు. ఈ ప్రాథమిక నివేదికను హోం మంత్రి అమిత్ షా కి అందజేస్తాం" అని తుమ్మల స్పష్టం చేశారు. రాష్ట్ర మంత్రుల ఈ ఢిల్లీ పర్యటనపై అన్ని వర్గాల దృష్టి సారించింది. వరద నష్టంపై కేంద్రం స్పందించి ఎలాంటి చర్యలు తీసుకుంటుందో అన్న ఆసక్తి నెలకొంది.

## అప్రమత్తంగా ఉండటం వల్లే ఆస్తినష్టం జరిగినా
# ప్రాణనష్టం తగ్గించగలిగాం



**హైదరాబాద్, :** భారీ వర్షాల కారణంగా కామారెడ్డి జిల్లాలో వరదలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశాయి. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి గురువారం కామారెడ్డిలోని జీఆర్ కాలనీని సందర్శించారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని, తక్షణ సాయం అందించేలా అధికారులను ఆదేశించారు. సీఎం మాట్లాడుతూ, "అప్రమత్తంగా ఉండటం వల్ల ఆస్తినష్టం జరిగినా ప్రాణనష్టం తగ్గించగలిగాం. వరదలు రాగానే ఇంచార్జ్ మంత్రి సీతక్క, షబ్బీర్ అలీ, ఎంపీ షెట్కర్, స్థానిక ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో ఉండాలని ఆదేశించాను. ఎప్పటికప్పుడు అధికారులకు సూచనలు చేశాను. అయినప్పటికీ మీ సమస్యలను ప్రత్యక్షంగా చూసేందుకు ఇక్కడికి వచ్చాను" అని తెలిపారు. ప్రజలకు భరోసా ఇస్తూ ఆయన, "పూర్తిస్థాయి వరద నష్టాన్ని అంచనా వేసి శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాను. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, ఇతర సామాగ్రిని అందించేందుకు చర్యలు తీసుకుంటాం. సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా విద్యార్థులకు సహాయం అందించేందుకు పరిశ్రమలతో చర్చించాలని సూచిస్తున్నాను" అని చెప్పారు. అలాగే, వరదల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం, పశుసంపదను కోల్పోయిన వారికి సహాయం అందించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. "కొడంగల్ కు నేను ఎంత సాయం చేస్తానో కామారెడ్డికి కూడా అంతే సాయం చేస్తా. ధైర్యంగా ఉండండి ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది" అని సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు.

## బీజేపీలో అవినీతి పరులకు స్థానం లేదు.
# కవితను పార్టీ లోకి తీసుకోము..



**హైదరాబాద్, :** ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా కవిత, బీఆర్ఎస్ అంశం హాట్ టాపిక్‌గా మారింది. ఆమె బీఆర్ఎస్ కు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీలో అవినీతి పరులకు స్థానం లేదని కవితని పార్టీ లోకి తీసుకోమని స్పష్టం చేశారు. గబ్బర్ సింగ్ టాక్స్ అన్న వారి తలలో మెదడు లేదు పెండ(గోబర్) ఉందని మండిపడ్డారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకటే.. ఆ రెండు పార్టీ లు అన్నదమ్ములు అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కు సంబంధించి కేవలం బ్యారేజీలపైనే కాదు.. మొత్తం ప్రాజెక్ట్ మీద సీబీఐ విచారణ జరపాలన్నారు. ఈ అంశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు కుమ్మక్కయ్యాయని ఆరోపించారు. కవిత గురించి ఎక్కువగా ఆలోచించొద్దని తెలిపారు. యూరియా కొరతపై స్పందించిన ఆయన.. కాంగ్రెస్ పొరపాటు వల్లనే తెలంగాణలో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. " కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ రేట్స్ తగ్గించి అన్ని వర్గాలకు పండుగ బహుమానం కేంద్రం ఇచ్చింది. మోడీ నేతృత్వంలో చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. పన్నుల వ్యవస్థను సరళీకరణ చేశారు. నిత్యావసర వస్తువులపై టాక్స్ ను జీరో చేశారు. మిడిల్ క్లాస్ ప్రజలకు ఎంతో ఊరట లభించింది. మోడీ, నిర్మల సీతారామన్ కి కృతజ్ఞతలు. జీఎస్టీ రేట్స్ తగ్గించినందుకు నరేంద్ర మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా కార్యకర్తలకు పిలుపునిస్తున్నాం. రాష్ట్ర మంతటా కార్యక్రమాలు చేయాలి.. వన్ నేషన్ వన్ లా వైపు కూడా వెళ్తున్నాం.. ఎల్లుండి అమిత్ షా భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి వేడుకల్లో పాల్గొంటారు అమిత్ షా పార్టీ కార్యక్రమం ఇంకా ఫైనల్ చేయలేదు. అధికారిక కార్యక్రమంతో పాటు మోజన్జాహి మార్కెట్ లో గణేష్ నిమజ్జన వేడుకల్లో పాల్గొంటారు." అని రామచందర్‌రావు వ్యాఖ్యానించారు.

## పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మకు గన్‌మెన్ల కేటాయింపు




**అమరావతి,:** తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మకు భద్రత కల్పించింది ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి సర్కార్.. పిఠాపురం మాజీ ఎమ్మెల్యేకు (1+1) గన్‌మెన్లను కేటాయించింది ప్రభుత్వం.. తనకు భద్రత కల్పించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు వర్మ.. దీంతో, ప్రభుత్వం ఆయనకు భద్రత కల్పించింది.. మరోవైపు మాజీ ఎమ్మెల్యే వర్మ భద్రతకు సంబంధించి గన్‌మెన్‌లు అవసరమని తాము నివేదిక ఇవ్వలేదని చెబుతున్నారు ఇంటెలిజెన్స్ అధికారులు.. కానీ, వర్మ విజ్ఞప్తి మేరకు గన్‌మెన్లను కేటాయించింది ప్రభుత్వం.. ఈ రోజు మాజీ ఎమ్మెల్యే వర్మ దగ్గర గన్‌మెన్‌లు బాధ్యతలు తీసుకున్నారు.. కాగా, ఈ మధ్యే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసిన వర్మ.. నియోజకవర్గంలోని పరిస్థితులు.. ఇతర అంశాలపై చర్చించారట.. ఇప్పుడు ఆయనకు భద్రత కల్పించింది సర్కార్.. ఇక, తన సీటును జనసేన అధినేత పవన్ కల్యాణ్ కోసం త్యాగం చేసిన వర్మ.. ఆ ఎన్నికల్లో పవన్ గెలుపు కోసం తన వంతు కృషి చేశారు.. ఈ నేపథ్యంలో వర్మకు ఏదైనా కీలక పదవి ఇస్తారనే చర్చ అప్పటి నుంచి సాగుతోంది.. తాజా పరిణామాలతో ఆయనకు ఏదైనా పోస్టు ఇస్తారా? అనేది మరోసారి తెరపైకి వచ్చింది..

# బీహార్ ఇసికి ఇదో అగ్నిపరీక్ష



బీహార్‌లో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ఓటర్ జాబితాపై అభ్యంతరాలు, మార్పులు, చేర్పుల దరఖాస్తులను గడువు ముగిసిన తరువాత కూడా పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీం కోర్టు సెప్టెంబర్ 1న ఇచ్చిన తీర్పు జాబితా నుంచి మినహాయించిన ఓటర్లకు ఒక అవకాశంగా పేర్కొనవచ్చు. దీనికి స్పందనగా ఎన్నికల కమిషన్ కూడా గడువు తరువాత వచ్చిన అభ్యంతరాలను, మార్పులు, చేర్పులను పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేసింది. అయితే వాటిని ఓటర్ జాబితా ఖరారైన తరువాతనే పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొంది. నామినేషన్ల దాఖలు చివరి తేదీ వరకు సవరణలు కొనసాగుతాయని సుప్రీం కోర్టుకు ఎన్నికల కమిషన్ తెలియజేసింది. ఇది స్వాగతించదగిన చర్య. దీనివల్ల జాబితా నుంచి మినహాయింపు పొందిన ఓటర్లు తమ ఆధార్ కార్డు ద్వారా జాబితాలో తిరిగి చోటు పొందవచ్చు. అయితే ఎన్నికల కమిషన్ వెల్లడించిన సంఖ్యలు అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఫారమ్ 6 ఉపయోగించి కొత్తగా 15 లక్షల మంది ఓటర్లు నమోదు కాగా, తొలగించబడిన 65 లక్షల ఓటర్లలో కేవలం 33,000 ఓటర్లే తమను తిరిగి చేర్చుకోవాలని దరఖాస్తులు చేయడం గమనార్హం. ఈ భారీ వ్యత్యాసం ఈ రెండు కేటగిరీ ఓటర్లు ఫారం 6 నే ఉపయోగించడంతో కోర్టుకు సమర్పించిన డేటాలో గందరగోళానికి దారితీసింది. దీంతో ఎన్నికల కమిషన్‌కు, రాజకీయ పార్టీలకు మధ్య పెద్ద వివాదం చోటుచేసుకుంది. జాబితా నుంచి మినహాయించిన ఓటర్లకు సహకరించడంలో పార్టీలు విఫలమయ్యాయని ఎన్నికల కమిషన్ వాదిస్తోంది. తాము అభ్యంతరాలను సమర్పించినా బ్లాక్ స్థాయి అధికారులు సరిగ్గా పరిశీలించడం లేదని పార్టీలు ఆరోపిస్తున్నాయి. అవకతవకలపై తమ పార్టీకి చెందిన బూత్‌స్థాయి ఏజెంట్లు ఎన్నికల సంఘానికి 89 లక్షల ఫిర్యాదులు సమర్పించారని, కానీ వాటన్నిటినీ ఎన్నికల కమిషన్ తిరస్కరించిందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పవన్ ఖేడా ఆరోపించారు. ఈ సవాళ్లను గమనించిన సుప్రీంకోర్టు బీహార్‌లోని ఓటర్లుకు, పార్టీలకు సహకరించడానికి పారా లీగల్ వాలంటీర్లను వినియోగించుకోవాలని బీహార్ రాష్ట్ర లీగల్ సర్వీస్‌కు మార్గదర్శకాలు జారీ చేసింది. దీనిపై రహస్య నివేదికను జిల్లా జడ్జిలకు సమర్పించాలని ఆ వాలంటీర్లకు ఆదేశించింది. ఈ విధంగా కోర్టు జోక్యం చేసుకోవడం డేటా ఆధారిత పరిశోధనలను ప్రతిబింబిస్తుంది. అలాగే జాబితాలోంచి ఓటర్ల మినహాయింపులో అసాధారణ పద్ధతులను అవలంబించారని ఆంగ్లపత్రిక కథనం వెలువడడం కూడా సుప్రీం కోర్టు గమనించింది. తొలగించిన ఓటర్ల వివరాలను ఎన్నికల కమిషన్ సమర్పించగా వాటిని పరిశీలిస్తే ఎన్నో లోపాలు కనిపించాయని ఆ పత్రిక తన అధ్యయనంలో పేర్కొంది. పోలింగ్ స్టేషన్లవారీగా ఈ వివరాలు వెల్లడయ్యాయి. 80 పోలింగ్ స్టేషన్ల పరిధిలో యువత మరణాలే అత్యధికంగా ఉన్నాయని ఎన్నికల కమిషన్ పేర్కొం ది. 127 పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఓటర్ల తొలగింపులో లింగ వ్యత్యాసం భారీగా కనిపించింది. 7216 పోలింగ్ స్టేషన్ల పరిధిలో అత్యధిక మరణాలు చోటు చేసుకున్నాయని పేర్కొంది. 973 పోలింగ్ కేంద్రాల పరిధిలో నూటికి నూరు పాళ్లు మృతులైన ఓటర్లే జాబితానుంచి తొలగించబడ్డారని ఎన్నికల కమిషన్ పేర్కొంది. 5084 పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఓటర్ల గైరుహాజరు అత్యధికంగా నమోదైంది. 663 పోలింగ్ కేంద్రాల పరిధిలో మహిళా ఓటర్లు శాశ్వతంగా మరో ప్రాంతానికి తరలిపోయినట్టు గుర్తించడమైంది. క్షేత్రస్థాయి అధ్యయనాలే ఈ పొరపాట్లను ఎత్తి చూపాయి. భారీ ఎత్తున పొరపాట్లను సవరించడం తప్పనిసరి. సంకుచిత రాజకీయాలకు అతీతంగా, వాస్తవంగా తొలగింపబడిన అసలు సిసలైన ఓటర్లకు సహాయంగా రాజకీయ పార్టీలు క్రియాశీలకంగా వ్యవహరించవలసిన బాధ్యత ఉంది. భాగస్వాములందరి నుంచి అటువంటి పౌర బాధ్యత ప్రజాస్వామ్య ప్రక్రియలో అవసరం. ఇక ఎన్నికల కమిషన్ కూడా తన బాధ్యతలను పకడ్బందీగా నెరవేర్చక తప్పదు. ముసాయిదా జాబితాలోంచి తొలగించబడ్డ ఓటర్లలో 99.5% మందిని ఆధార్ ప్రామాణిక ధ్రువపత్రంగా పరిగణించాలి. మినహాయింపు పొందిన ఓటర్లు తమ ఆధార్ కార్డు తగిన ప్రూఫ్‌గా తమ అభ్యంతరాలను సమర్పించవచ్చు. ఇప్పటికే ముసాయిదా జాబితాలో ఉన్న ఓటర్లకు అధికారికంగా ఇది సరిపోతుంది. బీహార్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ అనుభవం భవిష్యత్ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు పాఠంగా ఉపయోగపడుతుంది. దీర్ఘకాలం పాటు విస్తరించిన ఓటర్ల జాబితాల సమగ్ర సవరణకు అనుకూలంగా ఎన్నికల కమిషన్ తన సాంకేతిక పరిజ్ఞానాన్ని, అతి స్వల్ప గడువు విధానాన్ని, ఎన్నికల కమిషన్ నిషేధించవలసిన అవసరం ఉంది. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను తనిఖీచేసే విధానాన్ని అవలంబించాలి. అంతే తప్ప ఆదరాబాదరాగా ఓటర్ల జాబితాల ప్రక్రియను చేపడితే స్వచ్ఛమైన, స్పష్టమైన ఓటర్ల జాబితా తయారు కాదు. దానివల్ల ఓటర్ల హక్కుల కన్నా పరిపాలనా సౌలభ్యానికే ప్రాధాన్యం ఇచ్చినట్టు అవుతుంది. ఇదిలా ఉండగా బీహార్‌లో మహాగఠ్ బంధన్ ఆధ్వర్యంలో లోక్‌సభ విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటర్ అధికార్ యాత్ర ఓట్ల చోరీ డొల్లతనాన్ని బయటపెట్టింది. ఓట్ల చోరీపై త్వరలో కాంగ్రెస్ పార్టీ హైడ్రోజన్ బాంబును పేల్చబోతోందని రాహుల్ హెచ్చరించారు. బీహార్ ఓటర్ల సవరణ ప్రక్రియ ఎన్నికల కమిషన్‌కు, రాజకీయ పార్టీలకు మధ్య రాజకీయ రగడగా మారడం మంచి పద్ధతి కాదని చివరకు సుప్రీం కోర్టు కూడా హెచ్చరించడం గమనార్హం. ఎన్నికల కమిషన్ తమ పారదర్శకతను నిరూపించుకోవడానికి ఇదో అగ్నిపరీక్ష.

# కాళేశ్వరం మలుపులు.. మరకలు



రాష్ట్ర రాజకీయాల్లో ఇప్పుడు హాట్ టాపిక్ కాళేశ్వరం. ఈ ప్రాజెక్టు ఆది నుంచి అనేక వివాదాలతో మలుపులు తిరుగుతూ చివరకు కవిత సస్పెన్షన్‌కు దారి తీసింది. బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావుకు ఒకవైపు విచారణ పేరిట ప్రభుత్వం నుంచి ఎదురైన సవాళ్ళతోపాటు కన్న బిడ్డ ఆరోపణలతో మరింత దిగాలు పడాల్సి వచ్చింది. అవినీతి ఆరోపణలు వస్తే గిట్టని వారు చేసారంటూ దాట వేసేందుకు అవకాశం ఉంటుంది. కానీ సొంత బిడ్డనే అధికారంలో ఉన్నప్పుడు అవినీతి జరిగిందని ఆరోపణ చేయడంతో అవతలి పార్టీలు చేస్తున్న ఆరోపణలకు బలం చేకూర్చినట్లే. దీంతో కెసిఆర్ పేగు బంధాన్ని తెంచుకుని, దుఃఖాన్ని దిగమింగారు. కన్న బిడ్డే కదా అంటూ ఇంకా చూస్తూ జాప్యం చేస్తే ఆరోపణలు తీవ్రరూపం దాలుస్తున్నాయి. అవినీతి అనకొండ అంటూ భారీ ఆరోపణలు చేయడంతో ఇక చేసేది లేక కెసిఆర్ కఠిన నిర్ణయం తీసుకోక తప్పలేదు. ఆడ బిడ్డ పెళ్ళి ఎంతో సంతోషంగా, అంగరంగ వైభవంగా చేసినా అప్పగింత సమయంలో నిన్నటి వరకు అల్లారు ముద్దుగా ఉన్న బిడ్డ అత్తారింటికి పోతున్నదని, ఈ ఇంటి గడప దాటి ఆ గడపలోకి వెళుతుందని, ఎన్ని కష్టసుఖాలు పడుతుందోనన్న భావనతో తల్లిదండ్రుల కళ్ళలో నీళ్ళు తిరుగుతాయి. ఆ పెళ్ళి కుమార్తె కూడా తల్లిదండ్రులను కౌగిలించుకుని ఒకవైపు సంతోషం, మరోవైపు కన్న తల్లిదండ్రులను వదిలి వెళుతున్నానన్న బరువెక్కిన గుండెను నిబ్బరం చేసుకుని భర్త చేయి పట్టుకుని అడుగు ముందుకేస్తుంది. ఇప్పుడు సస్పెన్షన్ వేటుతో కవితను 'కారు' దించేయడంతో నా బిడ్డ రాజకీయ జీవన గమ్యం ఎలా ఉంటుందోనన్న బెంగ తల్లిదండ్రులకు ఉంటుంది. కానీ బిఆర్ఎస్ రాజకీయ పార్టీ. ఎక్కువ కాలం భరిస్తే పార్టీకి భారీ నష్టం. ఇప్పటికే నష్టం జరుగుతుందన్న గుసగుసలు పార్టీలో ఆరంభమయ్యాయి. ఆమె చేసిన వ్యాఖ్యలే మరెవరైనా చేసి ఉంటే గంటలోపే పార్టీ నుంచి బహిష్కరణ వేటు పడకమానదన్న గుసగుసలు. ఈ సమయంలో కెసిఆర్ మానసికంగా ఎంత కృంగిపోయి ఉంటారన్నది ఊహించవచ్చు. బిడ్డ వ్యాఖ్యలు పార్టీ బలోపేతానికి ఉపయోగపడాలే తప్ప కృంగిపోయేలా, నష్టం జరిగేలా ఉండకూడదు. నాన్న చుట్టూర దెయ్యాలు ఉన్నాయంటూ బహిరంగ విమర్శలు చేయడంతోనే పార్టీలోని నాయక, ద్వితీయ శ్రేణి, కార్యకర్తలు హతాశులయ్యారు. ఇతర పార్టీ నేతలు, ప్రజలు బిఆర్ఎస్ కలహాల కాపురం అంటూ జరుగుతున్న పరిణామాలపై ఆసక్తి పెంచారు. నాన్నకు ప్రేమతో అంటూ దెయ్యాల కథ చెప్పడం కుంపటి రాజుకుంది. మొన్నటి వరకూ అన్న కెటిఆర్‌నే టార్గెట్ చేసిన కవిత ఇప్పుడు తన బాణం దిశ మార్చి బావ, మాజీమంత్రి టి. హరీశ్ రావు పైకి వదిలారు. వదిలిన బాణం సాధారణమైందేమీ కాదు. అవినీతి అనకొండ అంటూ బ్రహ్మాస్త్రానే ప్రయోగించారు. బ్రహ్మాస్త్రం ప్రయోగిస్తే శత్రువే కాదు వాతావరణంపై ప్రభావం పడి, భూప్రకంపనాలు తలెత్తుతాయని పురాణాల్లో ఉంది. కవిత వ్యాఖ్యలూ అటువంటి విస్ఫోటనం జరిగినంతగా పార్టీని కుదిపేసింది. ఇక కాంగ్రెస్, బిజెపి నేతలు చాలా కాలంగా కాళేశ్వరం అవినీతి లక్ష కోట్లు అంటూ ఆరోపిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సర్కారు జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్‌ను నియమించి, విచారణ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టి చర్చించడం, సిబిఐ విచారణకు నిర్ణయం తీసుకోవడం జరిగిపోయాయి. అసెంబ్లీలో ఎంఎల్ఎల అభిప్రాయాల మేరకు కమిషన్ నివేదిక ఆధారంగా ప్రభుత్వమే చర్యలు తీసుకుంటుందని అందరి ఊహాగానాలను, అంచనాలను తలకిందులు చేస్తూ సిబిఐ విచారణకు ఆదేశించడం జరిగింది. సిబిఐ విచారణ నిర్ణయం వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిజెపి, బిఆర్ఎస్‌లను ఇరకాటంలో పెట్టి బంధించే అస్త్రాన్ని సంధించారు. రెండు పార్టీలను ఎండగట్టడమే వ్యూహం. ఇంతకాలం సిబిఐ విచారణకు డిమాండ్ చేసిన బిజెపి ఇప్పుడు ఎంత వేగంగా పావులు కదుపుతుందో చూద్దామన్నది ముఖ్యమంత్రి భావన. విచారణను త్వరితగతిన పూర్తి చేయించి కెసిఆర్‌ను, హరీశ్‌రావును దోషులుగా నిలబెట్టగలిగితే ముఖ్యమంత్రి వ్యూహం ఫలించినట్లే. అప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో కాంగ్రెస్, బిజెపి మధ్యే ప్రధాన పోటీ ఉంటుందన్న ఆలోచన. ఒకవేళ సిబిఐ విచారణ వచ్చే సార్వత్రిక ఎన్నికల వరకూ తాత్సారం జరిగితే బిఆర్ఎస్‌ను కాపాడుతున్నదే బిజెపియేనని, రాబోయే ఎన్నికల్లో బిజెపి బిఆర్ఎస్ 'దోస్తీ'కి సిద్ధమయ్యారని ఆరోపించేందుకు ఆస్కారం ఉంటుంది. ఇప్పుడు సిబిఐ విచారణకు కోర్టు అనుమతించకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇస్తూ వచ్చే నెల 7వ తేదీన వాదనలు వింటామని కోర్టు చెప్పడంతో వారికి కొంత ఉపశమనం లభించింది. ప్రభుత్వమే పిసి ఘోష్ నివేదిక ఆధారంగా చర్యలకు ఉపక్రమిస్తే అయిపోయేదన్న కొందరి ఆలోచన, అభిప్రాయం. కానీ అలా చేసి ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం బిఆర్ఎస్‌పై కక్ష కట్టిందన్న 'మరక' పడుతుందని ముఖ్యమంత్రి భావించారు. ఎవరి ఊహలకు అందని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేసిన పొరపాటును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేయదలచుకోలేదన్నది నిగూఢ అంతరార్థం. అప్పుడు ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు నాయుడును జైలుకు పంపించడంతోనే అనూహ్యంగా రాజకీయాలు మలుపులు తిరిగాయి. చంద్రబాబుపై ఊహించని విధంగా ఒకవైపు సానుభూతి, రెండవ వైపు జనసేన అధినేత, సినీ నటుడు పవన్ కళ్యాణ్ జైలుకెళ్ళి చంద్రబాబును పరామర్శించారు. అంతటితో ఆగకుండా జైలు బయటకు రాగానే మీడియాతో మాట్లాడుతూ వైఎస్ జగన్ ప్రభుత్వ దుశ్చర్యలను ఎండగడుతూ, ఇక మీదట తామూ తెలుగు దేశం పార్టీతో జత కడతామని సంచలన ప్రకటన చేశారు. ఆ వెంటనే బిజెపికి కూడా కలవడంతో ముచ్చటగా మూడు పార్టీలూ కలిసి కూటమిగా ఏర్పడి అధికారాన్ని అందిపుచ్చుకున్నాయి. ఆ తప్పును తాను చేయకూడదని, కెసిఆర్‌ను జైలుకు పంపించి సానుభూతి పొందేలా చేయకుండా, తన వ్యూహంలో భాగంగా బాణాన్ని బిజెపివైపు మరల్చారు. ఆ బాణాన్ని బిజెపి ఎలా ఎదుర్కొంటుందో చూద్దాం.

# ఆహార భద్రతా చట్టం పురోగతి ఎంత?



ఆహారం అత్యంత ప్రాథమిక మానవ అవసరం. అయినప్పటికీ ఆకలి, పోషకాహార లోపం భారతదేశంలో లక్షలాది మందిని పీడిస్తూనే ఉంది. దాదాపు మూడింట రెండు వంతుల జనాభాకు ఆహార హక్కును చట్టపరమైన హక్కుగా మార్చే జాతీయ ఆహార భద్రతా చట్టం, 2013 అమలులోకి వచ్చింది. జీవించే హక్కు, గౌరవానికి హామీ ఇచ్చే రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లో పాతుకుపోయిన జాతీయ ఆహార భద్రతా చట్టం భారతదేశ మానవ హక్కుల ప్రయాణంలో ఒక మైలురాయిగా నిలుస్తుంది. చట్టం అమలు పన్నెండు సంవత్సరాల తర్వాత కూడా, చట్టం పనితీరు వాగ్దానం సాకారం అయ్యిందా అన్న ప్రశ్న మిగిలి ఉంది. ఈ చట్టం తీరుతెన్నులు చూస్తే ఇది ఎంత మేరకు ఉపకరిస్తుందో తెలుస్తుంది. భారత సుప్రీం కోర్టు చాలా కాలంగా ఆహార హక్కు జీవించే హక్కులో అంతర్లీనంగా గుర్తించింది. జాతీయ ఆహార భద్రతా చట్టం ఈ సూత్రాన్ని క్రోడీకరించడానికి ప్రయత్నించింది. లక్ష్యంగా చేసుకున్న ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సబ్సిడీతో కూడిన ఆహార ధాన్యాలను నిర్ధారించడం, మిడ్-డే భోజన కార్యక్రమం, అలాగే ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ వంటి పథకాలను విస్తరించడం. మొదటిసారిగా, పాఠశాల పిల్లలకు వేడి వేడి భోజనం, ఆరు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు ఇంటికి తీసుకెళ్లే రేషన్, ప్రసూతి నగదు హక్కులు అమలు చేయగల హక్కులుగా గుర్తించారు. ఆర్టికల్ 39 (ఎ), 47లోని ఆదేశిక సూత్రాలు జీవనోపాధిని భద్రపరచడానికి, పోషకాహారాన్ని మెరుగుపరచడానికి, భారతదేశ రాజ్యాంగ నిర్మాణంలో ఆహార భద్రతను పొందుపరచడానికి రాష్ట్రాన్ని మరింత బాధ్యత వహిస్తాయి. దేశంలో ఆహార భద్రతా హామీలు ఉన్నప్పటికీ ఇప్పటికీ భయంకరమైన స్థాయిలో ఆకలిని ఎదుర్కొంటోంది. ఎఫ్ఎఒ అంచనాల ప్రకారం, 194 మిలియన్ల మంది భారతీయులు పోషకాహార లోపంతో ఉన్నారు. అయితే గ్లోబల్ హంగర్ ఇండెక్స్ 2022లో భారతదేశాన్ని 121 దేశాలలో 107వ స్థానంలో ఉంచింది. దీనిని 'తీవ్రమైన' వర్గంలో ఉంచింది. ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో దాదాపు 38% మంది పేలవంగా ఉన్నారు. 15- 49 సంవత్సరాల వయస్సు గల స్త్రీలలో సగానికి పైగా రక్తహీనతతో ఉన్నారు. ఇది సంవత్సరాల పురోగతిని తిప్పి కొడుతుంది. పోషకాహార లోపం కొనసాగడం ఒక లోతైన వైరుధ్యాన్ని నొక్కి చెబుతుంది. గత రెండు దశాబ్దాలలో భారతదేశ జిడిపి నాలుగు రెట్లు పెరిగి, ఆహార ధాన్యాల ఉత్పత్తి దాదాపు రెట్టింపు అయినప్పటికీ లక్షలాది మంది, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు, పిల్లలు తగినంత పోషకాహారం పొందకుండానే మిగిలిపోయారు. సంక్షేమ విధానం నుండి హక్కుల ఆధారిత చట్రానికి ఎన్ఎఫ్‌సిఎ మార్పును గుర్తించింది. అయినప్పటికీ దాని అమలు సరిపోని కవరేజ్, వనరుల పరిమితులు, అమలు అంతరాలు, అలాగే ప్రజా పంపిణీ వ్యవస్థ లీకేజీలు, అవినీతి వంటి వ్యవస్థాగత లోపాలతో దెబ్బతింది. లబ్ధిదారుల అంచనాలు పాత 2011 జనాభా లెక్కల డేటాపై ఆధారపడి ఉన్నాయి, లక్షలాది మంది మినహాయించబడ్డారు. పిల్లలు, తల్లులకు తలసరి కేటాయింపులు పూర్తిగా సరిపోదు, పోషకాహార- కేంద్రీకృత కార్యక్రమాలను దెబ్బతీస్తున్నాయి. అనేక రాష్ట్రాలు ఎన్ఎఫ్‌సిఎ కింద సమగ్ర నియమాలు రూపొందించడంలో విఫలమయ్యాయి. ఫిర్యాదుల పరిష్కారం, పర్యవేక్షణ విధానాలను ఆలస్యం చేస్తున్నాయి. ధాన్యం మళ్లింపు, మధ్యాహ్న భోజన పథకం కింద పెరిగిన పాఠశాల నమోదు, పేలవమైన మౌలిక సదుపాయాల నివేదికలు నమ్మకాన్ని కోల్పోయాయి. ప్రోటీన్ సూక్ష్మపోషక లోపాలను పరిష్కరించడం కంటే తృణధాన్యాలపై ఎక్కువగా ఆధారపడటం, వైవిధ్యభరితమైన ఆహార బుట్టలు, పోషకాహారంగా తగినంత ఆహారం అవసరాన్ని కూడా చట్టం విస్మరించింది. జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆహార హక్కు గౌరవ హక్కు నుండి విడదీయరానిది అని నొక్కి చెప్పింది. ఆకలి మరణాలు, దీర్ఘకాలిక పోషకాహార లోపంగా ముసుగు వేయబడినప్పటికీ, కేవలం సహజ ఫలితాల కంటే వ్యవస్థాగత పాలన వైఫల్యాలు ఎక్కువగా సూచిస్తాయి. ఉపశమనం, తాత్కాలిక దాతృత్వానికి మించి పౌరులను హక్కుదారులుగా, రాష్ట్రం బాధ్యతాయుతమైన విధి నిర్వహణదారుగా గుర్తించడం వైపు వెళ్లాలని కమిషన్ తెలుపుతున్నది.ఇది అమలులోకి వచ్చిన పది సంవత్సరాల నుండి, జాతీయ ఆహార భద్రతా చట్టం 90 కోట్ల మంది భారతీయులకు ఆహారం అందిస్తూనే ఉంది. కానీ ఆకలి ఆమోదయోగ్యం కాని స్థాయిలో కొనసాగుతోంది. దాన్ని పరిష్కరించడానికి ప్రస్తుత జనాభా డేటాతో లబ్ధిదారుల సంఖ్యలను నవీకరించడం అవసరం.ముఖ్యంగా పిల్లలు, మహిళలకు నాణ్యమైన పోషకాహారాన్ని నిర్ధారించడానికి మెరుగైన బడ్జెట్ కేటాయింపులు. రాష్ట్రస్థాయి నియమాలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలను, సామాజిక తనిఖీలు బలోపేతం చేయడం. పోషకాహార సమృద్ధిని మెరుగుపరచడానికి జాతీయ పంపిణీ వ్యవస్థ పాఠశాల దాణా పథకాలు స్థానికంగా లభించే, వైవిధ్యమైన ఆహారాన్ని ప్రోత్సహించడం కష్టతరమవుతుంది. దేశంలో నిండిన ధాన్యాగారాలు విస్తృతమైన ఆకలిని నైతికంగా సమర్థించలేనివిగా చేస్తాయి. ఆహార హక్కు దయాదాక్షిణ్యాలకు సంబంధించినది కాదు, న్యాయం. ప్రతి భారతీయుడి గౌరవం మనుగడను కాపాడుతూ, జాతీయ ఆహార భద్రతా చట్టం తన వ్యవస్థాపక దార్శనికతను సాకారం చేసుకునేందుకు, తగినంత వనరులు, పారదర్శక పాలనతో కూడిన బలమైన రాజకీయ సంకల్పం చాలా అవసరం.

## ఇలాగే కొనసాగితే.. అడవులు లేకుండా పోతాయి



న్యూఢిల్లీ : చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు గురువారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చెట్ల నరికివేత ఇలాగే కొనసాగితే.. మనకు అడవులు లేకుండా పోతాయని వ్యాఖ్యానించింది. పదేపదే మెరుపు వరదలు, హిమాలయాల్లో అక్రమంగా నరికివేయబడిన చెట్ల దుంగలు నదుల్లో ప్రవహించడాన్ని ప్రస్తావిస్తూ కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఇటీవల వరద నీటిలో భారీ సంఖ్యలో చెట్ల దుంగలు కొట్టుకువెళుతున్న దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్ముకాశ్మీర్, పంజాబ్ రాష్ట్రాల్లో మెరుపు వరదల గురించి కోర్టు తీవ్ర విచారం వ్యక్తం చేసింది. పర్యావరణ పరంగా సున్నితమైన హిమాలయాల్లో అడవులను నరికివేయడంతో పదే పదే ప్రకృతి విపత్తులు, మరణాలు సంభవిస్తున్నాయని పేర్కొంది. ”ఇది చాలా తీవ్రమైన సమస్య. వరదనీటిలో దుంగలు కొట్టుకువెళుతున్నట్లు కనిపిస్తోంది. ఇది ఇలాగే కొనసాగితే మనకు అడవులు కనిపించవు. పంజాబ్‌లో మొత్తం గ్రామాలు మునిగిపోయాయి. అభివృద్ధి అవసరమే కానీ పర్యావరణం, ప్రాణాలను పణంగా పెట్టడం సరికాదు ” భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ వ్యాఖ్యానించారు. ఈ అంశంపై జోక్యం చేసుకోవాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఆదేశించింది. అలాగే భారత జాతీయ రహదారి అథారిటీ (ఎన్‌హెచ్‌ఎఐ)కి నోటీసులు జారీ చేసింది. వరదల సమయంలో చండీగఢ్ , మనాలి మధ్య ఉన్న 14 సొరంగాలు మరణ ఉచ్చులుగా మారనున్నాయని పిటిషనర్ అనామిక రాణా తరపున న్యాయవాది ఆకాష్ వశిష్ట పేర్కొన్నారు. ఇటీవల వరదల సమయంలో సొరంగం లోపల 300మంది చిక్కుకుపోయారని అన్నారు.

## టారిఫ్‌లపై సుప్రీంకోర్టుకు ట్రంప్ యంత్రాంగం




వాషింగ్టన్ : టారిఫ్‌లపై ట్రంప్ యంత్రాంగం బుధవారం సుప్రీంకోర్టుకు వెళ్లింది. సమాఖ్య చట్టం ప్రకారం అధ్యక్షుడికి విస్తృత దిగుమతి సుంకాలు విధించే అధికారం ఉందని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై త్వరగా తీర్పు ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరారు. ట్రంప్ యంత్రాంగం సుప్రీంకోర్టులో వేసిన అప్పీళ్లలో ఇది తాజాది. ట్రంప్ వాణిజ్య విధానంలో ముఖ్యమైన అంశాన్ని జడ్జీల ముందు ఉంచనుంది. ట్రంప్ విధించిన టారిఫ్‌ల్లో అధికభాగం అత్యవసర అధికారాల చట్టాన్ని ఉల్లంఘించి విధించినవని ఫెడరల్ కోర్టు తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే ట్రంప్ సుప్రీంకోర్టుకు అప్పీల్ చేసేందుకు వీలుగా ఈ తీర్పు అమలును అక్టోబర్ 14 వరకు కోర్టు నిలిపివేసింది. అప్పటివరకు ప్రస్తుతం ఉన్న టారిఫ్‌లు యథావిధిగా అమలులో ఉంటాయని తెలిపింది. ఈ తీర్పుపై బుధవారం రాత్రి ట్రంప్ యంత్రాంగం డిజిటల్‌గా దాఖలు చేసిన పిటిషన్‌పై త్వరగా జోక్యం చేసుకోవాలని హైకోర్టును కోరడంతో పాటు మీడియాకు అందించింది. నవంబర్ ప్రారంభంలో కేసుపై వాదనలు చేపట్టాలని సొలిసిటర్ జనరల్ డి.జాన్‌సౌర్ కోర్టును కోరారు. ” ఈ తీర్పుతో గత ఐదు నెలలుగా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్‌ల ద్వారా కొనసాగిస్తున్న విదేశీ చర్చలపై అనిశ్చితి నెలకొంటుంది. ఇప్పటికే చర్చలు ఫలవంతమై కుదిరిన ఒప్పందాలు, కొనసాగుతున్న చర్చలు రెండింటినీ ప్రమాదంలో పడేస్తుంది” అని ఆయన పేర్కొన్నారు. ఈ చట్టవిరుద్ధమైన టారిఫ్‌లతో చిన్న వ్యాపారాలకు కూడా ప్రమాదం అధికంగా ఉందని లిబర్టీ జస్టిస్ సెంటర్ సీనియర్ న్యాయవాది, వ్యాజ్యం దాఖలు చేసిన జెఫ్రీ ష్వాబ్ పేర్కొన్నారు. ఈ టారిఫ్‌లు చిన్న వ్యాపారాలకు తీవ్రమైన హాని కలిగిస్తున్నాయని, వాటి మనుగడను ప్రమాదంలో పడేస్తున్నాయని అన్నారు. తమ క్లయింట్‌ల కోసం ఈ కేసుకు సత్వపరిష్కారం లభిస్తుందని తాము ఆశిస్తున్నామని అన్నారు.ు

## వరుసగా ఏడవసారి అగ్రస్థానంలో ఐఐటి మద్రాస్




న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా అన్ని విభాగాల్లో అత్యుత్తమ విద్యాసంస్థగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ- మద్రాస్ (ఐఐటి మద్రాస్) మరోసారి తన స్థానాన్ని పదిలపరుచుకుంది. వరుసగా ఏడోసారి అగ్రస్థానంలో నిలవడం విశేషం. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సి) బెంగళూరు, ఐఐటి ముంబయి ఈ కేటగిరీలో వరుసగా రెండు, మూడోస్థానాల్లో నిలిచాయి. గతేడాది ఇవి వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలవడం గమనార్హం. నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్‌ఐఆర్‌ఎఫ్) - 2025 రూపొందించిన పదవ ఎడిషన్‌ను కేంద్ర విద్యాశాఖ మంత్రి గురువారం విడుదల చేశారు. ఎన్‌ఐఆర్‌ఎఫ్ పదవ ఎడిషన్‌లో 17 విభాగాలకు అవార్డులు ప్రకటించబడ్డాయని కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. మరిన్ని సంస్థలు ఈ జాబితాలో చేరాయని అన్నారు. ఇది మన ఉన్నత విద్యారంగం సాధించిన స్థిరమైన వృద్ధిని చూపుతోందని అన్నారు. బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా దేశంలోనే అత్యుత్తమ లా కాలేజీగా, ఢిల్లీలోని ఎయిమ్స్ ఉత్తమ వైద్య, దంత కళాశాలగా ర్యాంక్ సాధించాయి. ఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వ్యవసాయానికి ఉత్తమ విద్యాసంస్థగా ఎంపికైంది. అలాగే పరిశోధనలో బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఉత్తమంగా నిలిచింది. ఇన్నోవేషన్ ర్యాంకింగ్ విభాగంలో ఐఐటి -మద్రాస్ మొదటి స్థానంలో నిలవడమే కాక ఉత్తమ ఇంజనీరింగ్ సంస్థ హోదాను కూడా పొందింది. రెండో స్థానంలో ఐఐటి -ఢిల్లీ నిలిచింది. ఉత్తమ రాష్ట్ర ప్రభుత్వ యూనివర్శిటీగా కోల్‌కతాలోని జాదవ్‌పూర్ యూనివర్శిటీ, చెన్నైలోని అన్నా యూనివర్శిటీలు నిలిచాయి. ఉత్తమ ఓపెన్ యూనివర్శిటీగా ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్శిటీ-ఢిల్లీ, స్కిల్స్‌లో ఉత్తమ యూనివర్శిటీగా సింబయాసిస్ స్కిల్స్ అండ్ ప్రొఫెషనల్ యూనివర్శిటీ నిలిచింది. ఉత్తమ యూనివర్శిటీగా ఐఐఎస్‌సి బెంగళూరు అత్యుత్తమ ర్యాంక్ పొందగా, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ (జెఎన్‌యు) న్యూఢిల్లీ మరియు మణిపాల్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. మేనేజ్‌మెంట్ విభాగంలో ఉత్తమ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) అహ్మదాబాద్ అత్యుత్తమ ర్యాంకును సాధించగా, ఐఐఎం బెంగళూరు, ఐఐఎం కోజికోడ్‌లు తరువాతి స్థానాల్లో నిలిచాయి. ఫార్మసీ విభాగంలో ఉత్తమ సంస్థగా జామియా హమ్‌దార్ద్ ,న్యూఢిల్లీ మొదటి ర్యాంకులో నిలవగా, బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్- పిలానీ, చండీగఢ్‌లోని పంజాబ్ యూనివర్శిటీ రెండు,మూడు స్థానాల్లో నిలిచాయి. ఉత్తమ కళాశాల విభాగంలో మొదటి మూడు స్థానాలను వరుసగా ఢిల్లీ హిందూ కళాశాల, మిరండా హౌస్ మరియు హన్స్‌రాజ్ కాలేజీలు గెలుచుకున్నాయి. ఆర్కిటెక్చర్ మరియు ప్లానింగ్‌లో ఐఐటి రూర్కీ అగ్రస్థానంలో నిలిచింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కోజికోడ్ మరియు ఐఐటి ఖరగ్‌పూర్‌లు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. కొత్త విభాగం స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలలోనూ ఐఐటి మద్రాస్ మొదటి స్థానంలో నిలవడం గమనార్హం.

# పరువుతీస్తున్న ‘ప్రక్షాళన’!




అనుకున్నదొకటైతే అయింది మరోటి. బిహార్‌లో ఆఖరి నిమిషంలో ఆదరాబాదరాగా ఎన్నికల సంఘం (ఈసీ) తలపెట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) అసలే అంతంతమాత్రంగా ఉన్న ఆ సంస్థ ప్రతిష్ఠను మరింత దెబ్బ తీసింది. ఓటర్లలో దొంగలున్నారన్న నిర్ణయానికొచ్చి, వారందరినీ ఏరిపారేయాలను కోవటం దీనంతటికీ కారణం. పోనీ అందుకు ప్రాతిపదికేమిటో ఎవరికీ తెలియదు. ఏడెనిమిది నెలల క్రితం ఎన్నో వ్యయప్రయాసలకోర్చి తానే రూపొందించిన జాబితాలో అవకతవకలున్నాయని అంగీకరించటమంటే తన పనితీరు సరిగా లేదని ఒప్పు కోవటమేనని ఆ సంస్థకు తోచలేదు. 2.74 కోట్ల మంది ఓటర్లలో 99.5 శాతం మంది తమ అర్హతలకు సంబంధించిన పత్రాలు సమర్పించారని ఈసీ సర్వోన్నత న్యాయస్థానానికి చెప్పగా ముసాయిదా జాబితా అవకతవకలు ఒక్కోటే బయటపడి దిగ్భ్రాంతి కలిగి స్తున్నాయి. అర్హులైన ఓటర్లు ఈసీ అడిగిన 11 పత్రాల్లో ఏదో ఒకటైనా దాఖలు చేయటానికి తిప్పలు పడుతుంటే అనర్హులైనవారు, అనుమానాస్పద వ్యక్తులు దర్జాగా జాబితాలో చోటు దక్కించుకున్నారు. కేవలం 39 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మీడియా సంస్థ ‘రిపోర్టర్స్ కలెక్టివ్’ నిశితంగా పరిశీలిస్తే అనేక అవకతవకలు బయటపడ్డాయి. ఒకే పేరు,తండ్రి/భర్త పేర్లు ఉండి కనీసం రెండు నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితాకెక్కిన 1,87,643 కేసుల్ని ఆ సంస్థ బయటపెట్టింది. కొందరైతే ఒక నియోజకవర్గంలోనే నదురూ బెదురూ లేకుండా ఆ పని చేశారు. మరికొందరు చిరునామాలు మార్చే శ్రమ కూడా తీసుకోలేదు. ‘స్వచ్ఛమైన జాబితా’ రూపకల్పనే ధ్యేయమంటున్న ఈసీ ఈ దొంగ ఓటర్ల విజృంభణకు ఏం సంజాయిషీ ఇస్తుంది? కనీసం అలాంటి విపరీతాలకు కారణమైనవారిపై చర్య తీసుకుంటామని చెప్పటం లేదు. పైగా బిహార్ ప్రధాన ఎన్నికల అధికారి(సీఈఓ) ‘రిపోర్టర్స్ కలెక్టివ్’ వెల్లడించిన అంశాలను ఖండించారు. ఈ క్రమంలో వారు ఎక్కడెక్కడ పొరబడ్డారో చెప్పేందుకు కూడా ప్రయత్నించలేదు. తనకున్న పరిమిత వనరులతో కేవలం 39 చోట్ల ముసాయిదాలో ఒక సంస్థ ఇన్ని లోపాల్ని పసిగట్టగలిగితే, ఓటర్లు అందజేసిన అర్హతా పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి నిగ్గుదేల్చే పనిలో తలమునకలైవున్న వేలాదిమంది ఎన్నికల సిబ్బంది ఏం పనిచేస్తున్నట్టు?

వారిపై అధికార పక్షాల ఒత్తిళ్లు న్నాయా? ముసాయిదాలో తొలగించిన 65 లక్షల మందీ ఈసీ దృష్టిలో నకిలీ ఓటర్లు. అందుకోసమే వారి వినతుల్ని పరిశీలించటానికి మొదట్లో ఆ సంస్థ సిద్ధపడలేదు. అందు కోసం సర్వోన్నత న్యాయస్థానం జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. గడువు ముగిసిన సోమ వారం నాటికి కేవలం 33,000 మంది మాత్రమే పత్రాలు సమర్పించారని ఈసీ చెబుతోంది. పొట్ట చేతబట్టుకుని నలు మూలలకూ పోయే సాధారణ కూలీలు, కార్మికులు తమ చిరునామాల్లో ఉండటం, ఈసీ అడిగిన పత్రాల్లో ఏదో ఒకటి సమర్పించటం అంత తేలికా? చిరునామాల్లో లేకపోతే మరణించినట్టు లేదా శాశ్వతంగా ఆ చిరునామా నుంచి నిష్క్రమించినట్టు ఎన్నికల సిబ్బంది రాసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. అయితే ‘ఓట్ చోరీ’ నినాదంతో ఉద్యమిస్తున్న విపక్షాలు సైతం ఆ సమస్య విషయంలో చిత్తశుద్ధితో వ్యవహరించాలి. సర్వోన్నత న్యాయస్థానం చెప్పినట్టు రాజకీయ పక్షాలు చురుగ్గా కదలాలి. తమ కార్యకర్తల సాయంతో అర్హులైనవారు ఓటర్ల జాబితాలకెక్కేలా సాయపడాలి. ఈ మొత్తం వ్యవహారంలో ఎవరిది పైచేయి అవుతుందన్న ప్రశ్న అర్థరహితం. ఎన్నికల నిర్వహణ క్రతువులో తలమునకలై ఉండాల్సిన ఈసీ జవాబుదారీతనాన్ని ప్రదర్శించాలి. నిలదీస్తున్నదెవరన్న విచికిత్సకు పోకుండా నిజాన్ని నిగ్గుతేల్చి తేల్చాలి. ఎందుకంటే రాగల కాలంలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ‘సర్’ అమలు ప్రారంభ మవుతుందని ఆ సంస్థే చెబుతోంది. ప్రతిచోటా ఇదే మాదిరి తప్పుల తడకలతో ఆ ప్రక్రియను సాగిస్తే ఈసీ దేశ ప్రజల దృష్టిలో మాత్రమే కాదు... ప్రపంచ దేశాల ముందు కూడా పలచనవుతుంది. ఓటర్ల జాబితాలో చేరటానికి విధించిన గడువును పొడిగించుకుంటూ పోతే మొత్తం ప్రక్రియ గందరగోళంగా తయారై, తుది జాబితా ఖరారు సమస్యాత్మకమవుతుందంటున్న ఈసీ వాదనల్లో నిజం లేకపోలేదు. కానీ అందుకు బాధ్యత వహించాల్సింది తాను కాదా? అసలు ఎవరూ కోరకుండానే చివరి నిమిషంలో ఈ పెనుభారాన్ని నెత్తిన వేసుకున్నదెవరు? ఈసీ ఆత్మపరిశీలన చేసుకోవాలి.

# ప్రజాస్వామ్య పునరుద్ధరణోద్యమం




జాతీయ స్వాతంత్ర్య పోరాటకాలంలోనూ, ఆ తరువాత ఎమర్జెన్సీలోనూ, ఆ మాటకొస్తే దేశానికి ముప్పువచ్చిన ప్రతి సందర్భంలోనూ కీలకమైన ప్రజా ఉద్యమాలకు వేదికైన ప్రాంతం బీహార్! దేశానికి కష్టకాలంలో ఐక్యంగా అండగా నిలబడటంతో పాటు పలుమార్లు దేశానికి అవసరమైన రాజకీయ చైతన్యాన్ని బీహార్ ప్రజలు ప్రదర్శించారు. ఆ బీహార్‌లోనే ప్రస్తుతం ప్రజాస్వామ్య పునరుద్ధరణోద్యమం సాగుతోంది. ఇండియా బ్లాక్ ఆధ్వర్యంలో జరిగిన ‘ఓటర్ అధికార్ యాత్ర’కు ప్రజల నుండి లభించిన విశేషమైన మద్దతే దీనికి నిదర్శనం. 25 జిల్లాల్లో 1300 కిలోమీటర్ల మేర సాగిన ఈ యాత్రలో ఇండియా బ్లాక్ పార్టీలు, బీహార్‌లో ఉన్న అనేక ఇతర పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతు తెలపడంతో పాటు, అన్ని విధాలా సహకరిం చాయి. పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రజలు ఈ యాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బీహార్ రాజధాని పాట్నాలో జరిగిన ముగింపుసభలో రెండు లక్షలకుపైగా ప్రజలు పాల్గొన్నారని అంచనా! అనేక చారిత్రాత్మక సంఘటనలకు వేదికైన గాంధీ మైదాన్‌లో ఈ సభ జరిగింది. సభకు హాజరైన వారు తమ ఓటు హక్కును హరిస్తున్న మోడీ ప్రభుత్వంపై ఆగ్రహంతో చేసిన నినాదాలు బీహార్ అంతా మారుమోగాయి. ‘ఓటు హక్కు మా స్వంతం. దాన్ని దోచుకోవడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించం’ అన్న గట్టి హెచ్చరికను ఈ సభ ద్వారా సాధారణ ప్రజానీకం కేంద్ర ప్రభుత్వానికి చేసింది. ఇప్పటి వరకు బీజేపీ-జేడీయూ ప్రభుత్వంపై నెలకొన్న వ్యతిరేకతను చూసీ చూడనట్టు ఊరుకున్న కొన్ని మీడియా సంస్థలు కూడా ‘ఓటర్ అధికార్ యాత్ర’ ముగింపు తర్వాత తమ వైఖరిని మార్చుకోవాల్సి వచ్చింది. ముఖ్యంగా ముగింపు సభ తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధోరణులు ఇదే మాదిరి కొనసాగితే వాటి పునాదులు కదులుతాయన్న సంకేతాలు మీడియా విశ్లేషణల్లో వెలువడు తుండటం గమనార్హం. నిజానికి, బీహార్‌లో అధికార భాగస్వామిగా కొనసాగడానికి బీజేపీ ఎన్నో టక్కుటమార విద్యలను ప్రదర్శించింది. అనైతిక మార్గాలను అనుసరించింది. తీవ్ర హిందుత్వ విధానాలతో ప్రజలను నిట్టనిలువునా చీల్చడానికి ప్రయత్నించింది. పహల్గాం ఉగ్రదాడిని కూడా ఎన్నికల రాజకీయాలకు ప్రధాని మోడీ వాడుకున్న తీరు ప్రస్తుతం బీహార్‌లో చర్చనీయాంశమైంది. ఇంత చేసినా అధికారంలో ఎక్కువ కాలం కొనసాగలేమన్న భావనతోనే ఓట్ల కుంభకోణానికి బీజేపీ తెరతీసిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎన్నికల సంఘాన్ని ఆయుధంగా చేసుకుని, మైనారిటీలు, దళితులు, వెనుకబడిన వర్గాలు, మహిళలు వీరందరికీ ఓటు హక్కు నిరాకరించడం. అధికార కూటమి అనుచరులు ఇష్టానుసారంగా ఓటు వేసేలా అనుమతిస్తూ తీసుకున్న పలు చర్యలు ఒకదాని తర్వాత ఒకటిగా వెలుగులోకి వస్తున్నాయి. వెలుగులోకి వస్తున్న అంశాలకు తగిన విధంగా స్పందించి, సమస్యలను పరిష్కరించడానికి బదులుగా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ బీజేపీ నేతల భాషలోనే ప్రతిపక్షాలపై దాడి చేయడం చర్చనీయమవుతోంది. బీహార్ నమూనాలోనే ఇతర రాష్ట్రాలలో కూడా ఓటర్ల జాబితా సవరణకు బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేపట్టడంతో ఆ పార్టీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందన్న అభిప్రాయం రోజురోజుకూ బలపడుతోంది. ఈ నేపథ్యంలోనే రాజ్యాంగ బద్ధమైన హక్కుల ను కాపాడుకునేందుకు ఐక్యంగా కదలాలన్న ప్రతిపక్ష విజ్ఞప్తికి ప్రజల నుండి సానుకూల స్పందన లభిస్తోంది. ‘ఓటర్ అధికార్ యాత్ర’ ముగింపు సభ జరిగిన తీరే దీనికి నిదర్శనం. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ, బీహార్ శాసనసభ ప్రతిపక్ష నాయకుడు తేజస్వి యాదవ్‌ల ఆధ్వర్యంలో సాగిన యాత్రకు వామపక్షాలు గట్టిమద్దతు ప్రకటించాయి. ఆ పార్టీల రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు ఈ యాత్రలో భాగస్వాములయ్యారు. ముగింపు సభకు సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబి హాజరయ్యారు. స్వతంత్ర భారత దేశంలో ఎన్నికల సంఘం యొక్క విశ్వసనీయత ఇంతగా గతంలో ఎప్పుడూ ప్రశ్నార్థకం కాలేదు. బీజేపీ ఆదేశాలను అమలు చేసే ఆయుధంగా ఎన్నికల సంఘం మారిపోవడాన్ని దేశ ప్రజానీకం ఎన్నటికీ అంగీకరించరు. ఓటుదోపిడీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరగబోయే ఆందోళనలకు బీహార్‌లో జరిగిన యాత్ర కేవలం ఆరంభం మాత్రమే!

# పాత్రికేయ పోరాట వీరుడు వరదరాజులు నాయుడు

అది 1932 సెప్టెంబర్ 5. ఆ రోజు మదరాసు నుండి 12 పేజీలతో డమ్మీ సైజులో ఒక కొత్త ఆంగ్ల దినపత్రిక వెలువడింది. విలక్షణమైన దృష్టితో ఆకర్షించి, సమగ్రమైన దినపత్రిక అది. ఈ దినపత్రికలో 3, 4 పేజీలు జాతీయ దృక్పథంతో అందించబడిన ప్రాంతీయ వార్తలు ఆక్రమించాయి. ఐదవ పేజీ ఆర్థిక, వాణిజ్య విషయాల వార్తలకూ, ఏడు, ఎనిమిది పేజీలు దేశ, విదేశ వార్తలకూ కేటాయించబడ్డాయి. పదవ పేజీ క్రీడా వార్తలకూ, 1, 2, 11 పేజీలు ప్రకటనలకు నిర్దేశించబడ్డాయి. ఆరవ పేజీ సంపాదకీయం, సంపాదకీయ వ్యాఖ్య వగైరాలకు ప్రత్యేకం ఆ పత్రిక ఇండియన్ ఎక్స్‌ప్రెస్! పత్రిక పేరులో ఉండే ఎగురుతున్న పతాకం, కరవాలాలు స్వాతంత్ర్య కాంక్షకూ, పోరాట శీలానికీ ప్రతీకలు. ఆ పత్రికను ప్రారంభించిన ఘనుడు డా? పి. వరదరాజులు నాయుడు! అప్పటికి ఆయనకు ప్రపంచ మిత్రన్’, ‘తమిళనాడు’ అనే తమిళ దిన పత్రికలూ, ‘ఆంధ్రప్రజ’ అనే తెలుగు పత్రికను నిర్వహించిన అనుభవం ఉంది. రెండు నెలలకు మించి ఈ ఇంగ్లీషు దినపత్రిక కొనసాగించలేకపోయినా ఈ పత్రిక దక్షిణాది ఇంగ్లీషు జర్నలిజానికి వేసిన దారులు మహా గొప్పవి. తెలుగు ప్రాంతాలల్లో చరిత్ర సృష్టించిన మహానుభావులను మరచిపోతున్న వేళ సేలం, కోయంబత్తూరు ప్రాంతాల్లో నుంచి వచ్చిన కులాలకు అతీతంగా, సమాజ శ్రేయస్సు లక్ష్యంగా పనిచేసిన తెలుగు వ్యక్తిని ఎవరు స్మరించుకుంటారు? తమకు తెలియదని తెలుగువారూ, తమ భాషవాడు కాదని తమిళులూ- ఇలాంటి విశిష్టమైన వ్యక్తిని మరచిపోయే అవకాశం చాలా ఉంది. మహాత్మాగాంధీ, వీరసావర్కర్, రాజాజీ, కట్టమంచి రామలింగారెడ్డి, అంబేద్కర్, శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ, రామస్వామి నాయకర్ వంటి హేమాహేమీలతో మిత్రత్వం, అవసరమైనచోట విభేదాలు గల మేధావి డా? పి. వరదరాజులు నాయుడు. 1887 జూన్ 4వ తేదీన సేలం దగ్గర ఉండే రాశిపురంలో పెరుమాళ్నాయుడు, కుప్పమ్మ దంపతులకు వరదరాజులు నాయుడు జన్మించాడు. కృష్ణదేవరాయలు ఆదేశంతో తండ్రి మీద మధురకు దండెత్తి విజయం సాధించిన విశ్వనాథ నాయకుడి సైన్యంలో పనిచేసిన వారు వీరి పూర్వీకులు, బలిజ నాయుళ్ళ తెగకు చెందిన వీరు తొలుత తంజావూరులోనూ, పిమ్మట తిరుమలనాయకుని కాలం లో సేలం ప్రాంతంలో స్థిరపడ్డారు. ఏడేళ్ళ వయసులో తల్లిదండ్రులను కోల్పోయిన వరదరాజులును మేనత్త, నాన్నమ్మలు పెంచారు. కోయంబత్తూరు లండన్ మిషన్ హైస్కూలులో మొదలైన వీరి చదువు చురుకుగా సాగి, బెంగాల్ విభజన సంఘటనతో ఆగిపోయింది. స్వదేశీ ఉద్యమం వైపు ఆకర్షితులై, విదేశీవస్తు బహిష్కరణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. అతివాదులవైపు ఆకర్షితులై 1908లో పాండిచ్చేరిలో సుబ్రహ్మణ్య భారతి ముందు స్వరాజ్య పోరాటం చేశారు. ఇలా మొదలైన ప్రజాజీవితం సుమారు అరశతాబ్దం సాగింది. వీరు పాల్గొనకుండా ఏ ప్రధాన ఉద్యమం మద్రాసు ప్రెసిడెన్సీ ప్రాంతంలో జరగలేదని అనడం అతిశయోక్తి కాదు. 1906- 07 ప్రాంతంలో కోయంబత్తూరు దగ్గర ఉండే ఉడుములపేటలో వరదరాజులు మద్రాసు ప్రోగ్రెసివ్ అసోసియేషన్ ప్రారంభించి అక్కడ ఒక పఠన మందిరాన్ని, గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. 1908లో మద్రాసులోని బర్మా మెడికల్ స్కూలులో భారతీయ వైద్యం గురించి అభ్యసించి, పిమ్మట కలకత్తాలోని దేశీయ వైద్య సంస్థలో స్థానిక వైద్య విధానాల గురించి నైపుణ్యం గడించాడు. తర్వాత తిరిగి వచ్చి కోయంబత్తూరు జిల్లా తిరుప్పూరులో వైద్యాన్ని ప్రారంభించారు. ఆయన వైద్యం ఎంత బాగా సాగేదంటే అప్పట్లోనే నెలకు రెండు వేల రూపాయలు సులువుగా సంపాదించేవారట. పిల్లల నుంచి వృద్ధుల దాకా అందరి రుగ్మతలను నయం చేసే ‘మిన్సర రసం’ బహుళ ప్రసిద్ధి చెందింది. ఇది వారి కృషే, వేదాలు, భారత రామాయణాలు బాగా అధ్యయనం చేసిన వరదరాజులు మంచి వక్త. చక్కని పత్రికా రచయిత. వీరు ప్రసంగిస్తే పదివేలకు మించి జనం వచ్చేవారట. 1911లో రుక్మిణమ్మతో వీరి వివాహం జరిగింది. మహిళల కోసం ఉద్యమించిన భర్త జైలుకెళ్లినపుడు ఉద్యమాన్ని నడిపారు ఈ మహిళామణి. బ్రాహ్మణ, బ్రాహ్మణేతర వివక్షకు వ్యతిరేకంగా పనిచేసి ఫలితం సాధించిన వరదరాజులు 1935 అక్టోబరు 22న అంబేద్కర్‌తో విభేదిస్తూ, తన వాదనను వివరించి ఆయనను సమ్మతింపచేసిన సంఘటన విశేషమైనది. తెలుగు మాతృభాష అయినా తమిళం, ఇంగ్లీషు భాషలలో వరదరాజులుకి గల పట్టు గొప్పది. తమిళ, ఇంగ్లీషు జర్నలిజం రంగాలలో స్వదేశీ మిత్రన్, హిందూ పత్రికలను నిర్వహించిన జి. సుబ్రమణ్య అయ్యర్ సరసన నిలబడిన పాత్రికేయ సంపాదకుడు వరదరాజులు, 1916లో ‘ప్రపంచ మిత్రన్’ పత్రిక ప్రారంభించి, బ్రిటిష్ రాజ్యాన్ని దుయ్యబట్టి, వెయ్యి రూపాయల జరిమానా ఎదుర్కొన్న వ్యక్తి కూడా ఈయన. బ్రిటిష్ ప్రభుత్వ ఒత్తిడితో ఈ పత్రికను ఆపివేశారు. 1919లో ‘తమిళనాడు’ పేరున మరో తమిళ దినపత్రికను కొంతకాలం నడిపారు. ‘ఆంధ్రప్రజ’ పేరున ఒక



తెలుగు పత్రికను కూడా డా? పి. వరదరాజులు నాయుడు నిర్వహించారు. అయితే ఆ తెలుగు ప్రతులు కానీ, వివరాలు కానీ అందుబాటులో లేవు. అప్పట్లో దినపత్రికలు సాయంకాలం వెలువడేవి. వీటికి భిన్నంగా ఉదయం పూట దినపత్రిక ‘ఇండియన్ ఎక్స్‌ప్రెస్’ను వెలువరించిన వ్యక్తి వరదరాజులు. ఆర్. వెంకటరాజులు నాయుడు ప్రచురణ కర్తగా, ఏ. రామశేష అయ్యర్ సంయుక్త సంపాదకుడుగా వరదరాజులు నాయుడు వెలువరించిన పత్రిక ప్రారంభ కాలంలో వెల ఒక అణా! అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీ ప్రధాని మునుస్వామినాయుడుతో సహా పి. సుబ్బరాయన్, కె.ఎమ్. పణిక్కర్, కె. నటరాజన్, రాజాజీ, కె. విజయ రాఘవాచార్ గార్ల శుభాకాంక్షలతో తొలిరోజు ప్రతిలో అభినందన ప్రకటనలు రెండు పేజీలు (తొమ్మిది, పది పేజీలు) వెలువడడం వారి పలుకుబడికి చిహ్నం.జర్నలిజంలో ప్రకటనల ప్రాధాన్యత తొలుత గుర్తించిన వ్యక్తి వరదరాజులు నాయుడు. 1930లో పత్రికలకు వ్యతిరేకంగా బ్రిటిష్ ప్రభుత్వం ఒక చట్టం తెస్తే, దీన్ని ఖండిస్తూ ఉద్యమం నడిపిన పాత్రికేయ పోరాటవీరుడు వరదరాజుల నాయుడు. డా? టి.ఎన్. నాయర్, పి. త్యాగరాయ శెట్టిగార్ల సౌత్ ఇండియన్ లిబరేషన్ అసోసియేషన్, అనిబిసెంట్ హోరీమూల్ ఉద్యమాలను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పక్షం చేరారు వరదరాజులు. ఈ ఉద్దేశ సాధన కోసం జర్నలిజంలో ప్రవేశించారు. రాజాజీ మంత్రివర్గంలో పని చేసిన వరదరాజులు నాయుడు 1957 జులై 23న గతించారు. 1944 నవంబర్ 14న ప్రఖ్యాత సంపాదకులు కుందుర్తి ఈశ్వరదత్ జైపూర్ నుంచి డా? పి. వరదరాజులు నాయుడికి ఉత్తరం రాశాడు. అందులో ఢిల్లీనుంచి పత్రిక నడపాలనే వరదరాజులు కోరికను ప్రస్తావిస్తూ, అది తలకు మించిన భారం కాగలదని హెచ్చరించారు. జాతీయవాదం, సంఘ సంస్కరణ, కార్మిక సంక్షేమం వంటి లక్ష్యాలతో చివరికంటూ పనిచేసిన వరదరాజులు నాయుడు ఇంట్లో అందరూ తెలుగునే మాట్లాడాలని గట్టిగా కోరేవారట. ఈ విషయాలను ఇష్టంగా ఆయన వారసులు చెప్పుకుంటారు. డా? పి. వరదరాజులు నాయుడి గురించి తెలుగువారికి మరిన్ని విషయాలు తెలియాలి!

Editor,Printer,Publisher,Owner By:Kotlapalli Fouziya,Printed At by M/s Fouziya Publication,Door No:26-4-1273/3,Melapuram,Hindupur.Sri Sathya Sai district, Andrapradesh - 515201, bharathreporter@gmail.com,Cell: 9059679786 RNI No.APTEL/ 2023/88573.